





# ఆకాంక్ష

T/TG/2024/0523/7229/1544

తెలుగు సంచలన దిన పత్రిక









పబ్లిష్ : తెలంగాణ   శనివారం 24 -05-2025   సంపుటి : 01 సంచిక :165   ఎడిటర్ ; పెనుగొండ సతీష్   పేజీలు ; 08   వెల ; 5 రూ/-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla

# ఎన్నికలప్పుడే రాజకీయాలు
# అందరినీ కలుపుకుని పోతా



## కెసిఆర్ తన 40 ఏళ్ల అనుభవాన్ని అభివృద్ధికి కేటాయించాలి

- రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధానిని కలుస్తూనే ఉంటా
- నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేస్తాం
- వారికి పరిహారం న్యాయయం చేసే బాధ్యత జగ్గారెడ్డిదే
- జహీరాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

సంగారెడ్డి, మే 23 (ఆకాంక్ష ): ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లయినా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టు కుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష

మిగతాది 2 లో...

# కవిత లేఖ ఓటిటి ఫ్యామిలీ డ్రామా

- కాంగ్రెస్ వదిలిన బాణం అంటూ బండి సెటైర్స్
- కవిత లేఖ డ్రామా వెనక రేవంత్ : రఘునందన రావు



హైదరాబాద్, మే 23 (ఆకాంక్ష ): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖపై ఇప్పటికే రేవంత్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు స్పందించారు. తాజాగా కవిత లేఖపై బీజేపీ సైతం స్పందించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. కాంగ్రెస్ వదిలిన బాణం అనే శీర్షికతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. డాడీకి రాసిన లేఖ ఒక ఓటీటీ- ఫ్యామిలీ డ్రామాగా మారవచ్చునని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. తెలంగాణను విఫలం చేశాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వారంత కలిసి బీజేపీని నిందిస్తున్నారని చెప్పారు. కుటుంబ పాలనను తమ పార్టీ నిత్యం వ్యతిరేకిస్తునే ఉందని ఈ సందర్భంగా

మిగతాది 2 లో...

# ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

- ప్రపంచానికి మన సత్తాను చాటగలిగాం
- ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తి లేదు
- ఢిల్లీలో బిఎస్ఎఫ్ కార్యక్రమంలో షా





న్యూఢిల్లీ, మే 23 (ఆకాంక్ష ): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ది చెప్పడమే గాకుండా, భారత సైనిక శక్తి పాటవాన్నిప్రపంచానికి తెలియ చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి

మిగతాది 2 లో...

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

## వేకువ జాము కావడంతో తప్పిన ముప్పు



విశాఖపట్టణం,మే 23(ఆకాంక్ష ): ఉక్కునగరం విశాఖ స్టీల్ ప్లాంట్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎస్ఎంఎస్-2 లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన స్టీల్ ప్లాంట్ అగ్నిమాపక సిబ్బందిమంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. అయితే ప్రమాద సమయంలో కార్మికులు విధుల్లో లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. అగ్నిప్రమాదం తెల్లవారుజామున జరగడంతో కార్మికులు విధులకు హాజరు కాలేదు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై స్టీల్ ప్లాంట్ అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. ఆస్తి నష్టం ఏ మేర జరిగిందనే విషయాలు తెలియరాలేదు. దీనిపై అధికారులు అంచనా వేస్తున్నారు. స్టీల్ ఎ÷-లాంట్ ఎస్ఎంఎస్-2లో ద్రవపు ఉక్కు ప్రమాదాలు జరుగుతుంటాయని కార్మికులు

# రష్యాకు చేరుకున్న భారత ఎంపిల బృందం

## కనిమొళి సారథ్యంలో ప్రత్యేక విమానంలో మాస్కో చేరిక

### మధ్యలో డ్రోన్ దాడులతో విమానానికి అంతరాయం

న్యూఢిల్లీ, మే 23 (ఆకాంక్ష ): భారతదేశ ఎంపిల బృందం వెళ్లుతున్న ప్రత్యేక విమానం మార్గమధ్యంలో డ్రోన్ దాడికి గురైంది. పహల్గాం ఉగ్రదాడి , ఇందుకు ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర తరువాత కేంద్ర ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో పాకిస్థాన్ నిజరూపాన్ని తెలియచేసేందుకు సంకల్పించింది. దేశంలోని పలు రాజకీయ పార్టీల ఎంపిలతో కూడిన బృందాలు వేర్వేరుగా బయలుదేరాయి. కాగా డిఎంకె నాయకురాలు, ఆ పార్టీ ఎంపి , కరుణానిధి కుమార్తె కనిమొళి నాయకత్వంలోని ఎంపిల బృందం వెళ్లుతున్న విమానానికి తృటిలో ముప్పు తప్పింది. ఈ



మిగతాది 2 లో...

# కోటాలోనే ఎందుకీ ఆత్మహత్యలు

ప్రభుత్వం వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదు ■ వరుస ఆత్మహత్యలపై నిలదీసిన సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ,మే 23 (ఆకాంక్ష ): రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇలాంటివి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ- ఖరగ్‌పూర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఐఐటీ- ఖరగ్‌పూర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు

మిగతాది 2 లో...

# కడప జిల్లాలో దారుణ ఘటన

## నాలుగేళ్ల బాలికపై అత్యాచారం..హత్య



కడప, మే 23 (ఆకాంక్ష ): ఆంధ్రప్రదేశ్‌లో మరో దారుణం వెలుగు చూసింది.. కడప జిల్లాలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి.. ఆపై హత్య చేశాడో కామాంధుడు. చిన్నారిని అత్యాచారం చేసి.. హత్య చేసి.. ఆ తర్వాత కంపచెట్లలో పడేసి వెళ్లిపోయాడా దుండగుడు. శుక్రవారం నాడు నాలుగేళ్ల చిన్నారిని రేప్ చేసి.. చంపి ముళ్లపొదల్లో వేసిన దారుణ ఘటన మైలవరంలోని కంబాలదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. జమ్మలమడుగు మండలం మొరగుడి గ్రామానికి చెందిన ఓ వివాహ కార్యక్రమానికి వచ్చిన ఓ యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు- స్థానికులు తెలిపారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని మైలవరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అయితే, నిందితుడిని ఎన్ కౌంటర్ చేయాలని

మిగతాది 2 లో...

# రూ.200 కోట్లు విలువ చేసే స్థలం కబ్జా

## జూబ్లీహిల్స్‌లో కూల్చేసి స్వాధీనం చేసుకున్న హైడ్రా

హైదరాబాద్, మే 23 (ఆకాంక్ష ): జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాచేయడమే గాకుండా తనదే స్థలం అంటూ సుప్రీం దాకా వెళ్లగా కోర్టు దానిని తిరస్కరించింది.దీంతో హైడ్రా



మిగతాది 2 లో...

# అవును నేనే లేఖ రాసా
# అయినా అది ఎలా లీకయ్యిందన్నదే ప్రశ్న

## కెసిఆర్ దేవుడు...ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయి

- ఉన్న విషయాలనే లేఖ ద్వారా తెలియ చేశా
- ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 23 (ఆకాంక్ష ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ రాయడంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# కవిత లేఖ ఓటిటి ఫ్యామిలీ డ్రామా

ఆయన గుర్తు చేశారు. అది గాంధీ ఫ్యామిలీ అయినా.. కల్వకుంట్ల ఫ్యామిలీ అయినా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలు వారి వ్యక్తిగత సంక్షోభాలను ప్రజా భావోద్వేగంగా మార్చడానికి ప్రయత్నిస్తాయన్నారు. ఎవరైనా దోషి అయితే.. వారిని ఏదీ రక్షించ లేదన్నారు. కానీ ఈ అంశాన్ని తెలంగాణ చూస్తుందని.. ఆ క్రమంలో ఈ డ్రామాను తీవ్రంగా పరిగణించడం లేదని తెలిపారు. అయితే ప్రతీ సర్వేలో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ పెరుగుతుందన్నారు. శబ్దం లేకుండా, అధికారం లేకుండా, కేవలం ప్రజల నమ్మకంతోనే తమ పార్టీ ప్రజల్లో అంతర్లీన ప్రవాహంగా వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిజమైన మార్పుతోపాటు- అభివృద్ధిని సైతం కోరుకుంటున్నారని తెలిపారు. రాజకీయం.. కుటుంబ డ్రామా కాదన్నారు. ఆ మార్పు బీజేపీతోనే అవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక కల్వకుంట్ల కవిత లేఖపై బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు స్పందించారు. కవిత లేఖ రాజకీయ పంచాయితీనా? ఆస్తుల పంచాయితీనా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్లు- కనిపిస్తోందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి కవిత వెళ్లే అవకాశాలు కనపడుతున్నాయన్నారు. కవిత లేఖ డ్రామా వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ చిచ్చు నిజమని తెలుస్తోందన్నారు. కవితను బయటకు పంపేందుకే కేటీఆర్, హరీశ్‌రావు ఒకటయ్యారని తెలిపారు. ఎవరు ఏం చేసినా తెలంగాణలో మాత్రం బీజేపీదే అధికారమని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# కోటాలోనే ఎందుకీ ఆత్మహత్యలు

చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పూర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. కోటాలో నీట్ కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు- చేశామని చెప్పారు.

# కడప జిల్లాలో దారుణ ఘటన

స్థానికులు డిమాండ్ చేసారు.. చిన్నారిని రేప్ చేసి హత్య చేసిన ఘటనపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ మధ్యకాలంలో కొంతమందిలో మానవత్వం పూర్తిగా నశించిందన్న ఆమె.. ఇటు-వంటి వారిని ప్రభుత్వం క్షమించదని హెచ్చరించారు.. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేశాం.. ఇటు-వంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది... ఎవరైనా బాలికలను టచ్ చేయాలంటే వణికేలా యాక్షన్ ఉంటుందన్నారు.

# అందరిని కలుపుకుని పోత




చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సింగూరు ప్రాజెక్టను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పులబాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేసేందుకు కంకణం కట్టు-కున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదని సిఎం రేవంత్ వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని అన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు-కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు- వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటు-న్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు...ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. ఇఐఊర, ఇఊర, కఐః, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాంఅని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రయిక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది. ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తరవాత తగిన గుణపాఠం చెబుతామని ప్రధాని బీహార్‌లో ప్రకటించారని, అందుకు అనుగుణంగానే ఉగ్ర శిబిరాలపై దాడి చేశామని అన్నారు. కానీ పాక్ మాత్రం జనావాసాలు, విమాన స్థావరాలపై దాడులకు తెగించిందని అన్నారు. వాటిని మన రక్షణ దళాలలు సమర్థంగా తిప్పికొట్టడమే గాకుండా పాక్ కోలుకోలేని విధంగా జవాబిచ్చామని అమిత్ షా అన్నారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఒకవైపు కార్మికులు చేస్తున్న దీక్ష.. మరోవైపు ఈ ప్రమాదం జరగడం.. సమయానికి కార్మికులు విధులకు వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంటున్నారు. కాగా, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు సమ్మె చేపట్టారు. మంగళవారం నుంచి కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. వారి సమ్మెకు సంఘీభావంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు సైతం ఒకరోజు సమ్మె చేపట్టారు. ఉద్యోగులకు నోటీసులు.. కార్మికుల తొలగింపునకు నిరసనగా విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, రెగ్యులర్ ఉద్యోగులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు- ప్రకటించాలన్న డిమాండ్లతో కార్మికులు సమ్మెకు దిగారు. మరోవైపు కార్మికులకు మద్దతుగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. స్టీల్ ప్లాంట్‌లో విధుల నుంచి తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవడంతోపాటు- వారి డిమాండ్లను కూడా యాజమాన్యం పరిష్కరించాలని షర్మిల డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు మద్దతుగానే తాను నిరాహార దీక్షకు దిగినట్లు తెలిపారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న షర్మిల.. స్టీల్ ప్లాంట్ వద్ద దీక్ష ప్రారంభించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న కార్మికులకు ఆమె మద్దతు తెలిపారు.

# రష్యాకు చేరుకున్న భారత ఎంపిల బృందం

ఘటన గురువారం అర్థరాత్రి దాటిన తరువాత జరిగిందని డిఎంకె ఎంపి సన్నిహిత వర్గాలు చెన్నైలో తెలిపాయి. డ్రోన్ దాడితో విమానం గాలిలో చాలా సేపు చక్కర్లు కొట్టింది. పైలట్ ఇతర సిబ్బంది అతికష్టం మీద దీనిని అదుపులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో ముప్పావు గంట ఆలస్యంతో విమానం మాస్కో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. తమ ఎంపి ఇతరులు సురక్షితంగా కిందకు దిగారని పార్టీ వర్గాలు శుక్రవారం తెలిపాయి. పాక్ ఉగ్రవాద ఊతం, దుందుడుకు చర్యలను అంతర్జాతీయ సమాజానికి తెలియచేసేందుకు ఖరారు చేసిన ఎంపిల బృందాల పర్యటనలో భాగంగా కనిమొళి టీం తొలి దశలో బయలుదేరింది. అయితే రష్యా గగనతలం రాత్రి ఎక్కువగా భీకర దాడులతో దద్దరిల్లింది ఉక్రెయిన్‌తో ఘర్షణల నేపథ్యంలోనే ఈ డ్రోన్ల మెరుపుదాడులు చాలా సేపటివరకూ జరిగాయి. ఈ దశలోనే రష్యా గగనతలం పైకి వచ్చిన ఎంపిల విమానం తాకిడికి గురైంది. అయితే ఈ డ్రోన్లు పెద్దగా శక్తివంతం కాకపోవడంతో విమానానికి ఎటువంటి నష్టం వాటిల్లలేదు. సురక్షితంగా మాస్కోలోని డోమోడెవోవా విమానాశ్రయానికి చేరిన ఎంపిల బృందానికి రష్యాలోని భారత రాయబారి వినయ్ కుమార్, ఇతర అధికారులు స్వాగతం పలికారు. తరువాత వారిని సురక్షిత ప్రాంతంలోని ఓ తీసుకువెళ్లారు. ఈ బృందంలో ఎస్‌పి ఎంపి రాజీవ్ రాయ్, ఎన్‌సి ఎంపి మిమాన్ అల్తాఫ్ అహ్మద్, బిజెపి ఎంపి కెప్టెన్ బ్రిజేష్ చౌత, ఆప్ ఎంపి అశోక్‌కుమార్ మిత్తల్ , కొందరు రాయబారులు ఉన్నారు. పఃన రాత్రంతా గంటల తరబడి జరిగిన ఉక్రెయిన్ డ్రోన్ల దాడితో రష్యా అధికారులు వెంటనే స్పందించారు. ఈ క్రమంలో పలు విమానాల రాకపోకలను నిలిపివేశారు. మొత్తం మీద 153 విమానాల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి సమీక్షించుకుని తాము తాత్కాలిక విమాన యాన ఆంక్షలకు దిగినట్లు- అధికారులు తెలిపారు. పలు విమానాశ్రయాలను కొద్ది సేపు మూసివేశారు. మాస్కోకు రావల్సిన విమానాలను వేరే ప్రాంతాలకు తరలించారు. డ్రోన్ల దాడులు, విమానాల రాకపోకలపై ప్రభావం గురించి అధికార వర్గాలు పెద్దగా స్పందించారు. నిర్థిష్ట కారణాలను తెలియచేయలేదు. భారత పార్లమెంటేరియన్లతో కూడిన బృందం తొలి విడత పర్యటనలో అపశృతి అధికార వర్గాలలో కలవరానికి దారితీసింది. దాడులలో విమానానికి ఎటువంటి ముప్పు తలెత్తకపోవడం పట్ల అంతా ఊపిరి పీల్చుకున్నారు. టర్కీ దౌత్యంతో ఉక్రెయిన్, రష్యా మధ్య ఇటీవలే జరిగిన శాంతి చర్చలలో ఎటువంటి సత్ఫలితం లేదనే విషయం ఇప్పుడు మాస్కో చుట్టు-పక్కల ఉక్రెయిన్ సాగించిన డ్రోన్ల దాడులతో తేటతెల్లం అయింది. ప్రత్యేకించి మాస్కోకు 400 కిలోమీటర్ల దూరంలోని ఎలెట్స్ పట్టణం భారీ సంఖ్యలో డ్రోన్ల దాడికి గురైందని ఆర్టీవిఐ న్యూస్ పోర్టల్ తెలిపింది. కనిమొళి సారథ్య బృందం రష్యాలోని పలువురు ఉన్నతాధికారులతో, రాయబారులతో , మేధోవర్గంతో మాట్లాడుతుంది.

# రూ.200 కోట్లు విలువ చేసే స్థలం కబ్జా

రంగప్రవేశం చేసి స్థలంలో ఉన్న కట్టడాలను కూల్చేసి దానిని కాపాడింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది శుక్రవారం నేలమట్టం చేసింది. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి తెలియకుండా చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జాదారుడు.. హోటల్, హాస్టల్‌కు అద్దెకిచ్చి నెలకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై హైడ్రాకు ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా.. గతంలోనే కిరాయిదారుడికి నోటీసులు ఇచ్చింది. సదరు కిరాయిదారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ నిర్మాణాలపై ఎలాంటి హక్కు లేదని.. రోడ్డు, నాలాను ఆక్రమించి భవనాలు ఎలా నిర్మిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. దీంతో శుక్రవారం బుల్డోజర్లతో విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు- చేయనున్నట్టు- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా చర్యలను స్థానికులు అభినందించారు. ప్రభుత్వభూమిని కాపాడారని కొనియాడారు. ఈ కూల్చివేతల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అవును నేనే లేఖ రాసా అయినా అది ఎలా లీకయ్యిందన్నదే ప్రశ్న

స్పందించారు. కేసీఆర్‌కు తాను లేఖ రాశానని చెప్పారు. రెండు వారాల క్రితమే తాను లేఖ రాశానని.. ఆ లేఖ ఎలా లీక్ అయ్యిందో తనకు అర్థం కావడం లేదన్నారు. అమెరికా నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కవితను మీడియా ప్రతినిధులు లేఖ అంశంపై ప్రశ్నించారు. దీనికి స్పందించిన కవిత.. నిజమే ఆ లేఖ తానే రాశానని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కొన్ని సంచలన కామెంట్స్ చేశారామె. నేను కేసీఆర్‌కు లేఖ రాశాను. రెండు వారాల క్రితమే కేసీఆర్‌కు లేఖ రాశాను. నా అభిప్రాయాలను లేఖ ద్వారా తెలియజేశాను. కేసీఆర్‌కు రాసిన లేఖ ఎలా లీక్ అయిందో తెలియడం లేదు. కేసీఆర్ దేవుడు.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. కేసీఆర్‌కు నేను రాసిన లేఖ బయటకు వస్తే.. పార్టీలో ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటీ-. కేసీఆరే మా నాయకుడు. కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తాం. లేఖ రాయడంలో పర్సనల్ ఎజెండా ఏమీ లేదని కవిత చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ముందుకు పోతుందని వెల్లడించారు. తనకు పార్టీ, కేసీఆర్‌తో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు సంబర పడొద్దని.. వాళ్లకు కోతికి కొబ్బరి చిప్పదొరికినట్టయ్యిందన్నారు. 'నేను నాకొడుకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ పూర్తి చేసుకుని అమెరికా నుంచి వెళ్లి వచ్చే లోపల మరేదో లేఖ లీకైందని చెప్పి గత రెండు మూడు రోజులుగా హంగామా జరుగుతున్నట్లు- తెలుస్తోంది. ఈ సందర్భంగా నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. రెండు వారాల కిందట కేసీఆర్‌కి లేఖ రాయడం జరిగింది. గతంలో కూడా నా అభిప్రాయాలను కేసీఆర్‌కు లేఖ ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ సారి కూడా లేఖ రాశాను. నేను మొన్ననే చెప్పాను. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయి అని. చెప్పిన కొద్ది రోజుల్లోనే నేను అంతర్గతంగా కేసీఆర్ కి రాసిన ఉత్తరం బహిర్గతం



కావడంతో పార్టీలో ఏం జరుగుతుందో అన్నది మనమందరం ఆలోచించాల్సిన విషయం. నేను వేరే విషయాలు ఏం చెప్పలేదు. నేను కేవలం పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్న నాయకులందరూ అనుకుంటున్న విషయాలు దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటు-న్న విషయాలను మాత్రమే నేను పెద్ద ఎత్తున చెప్పడం జరిగింది. తనకు ఎలాంటి పర్సనల్ ఎజెండా లేదు. తనకు వ్యక్తిగతంగా ఎవరి మీద ద్వేషం లేదు. ఎవరి మీద ప్రేమ లేదు. కానీ నేను రాసిన లేఖ. అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతమైందంటే దీని వెనుక ఉన్నది ఎవరు అనేది ఆలోచించుకోవాల్సిన విషయమని కవిత వ్యాఖ్యానించారు.

# తెలంగాణ ఫోరం నాయకులు మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం




**మంథని (ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మే 28న పెద్దపల్లి లో తలపెట్టిన సభకు హాజరుకావాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆహ్వానించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ధన్వాడలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి ఈనెల 28న పెద్దపెల్లిలో జిల్లా కేంద్రంలోని గార్డెన్ లో తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మాన కార్యక్రమం ఉందని తమరు తప్పక రావాలని ఆహ్వానించారు. జిల్లాలోని ఉద్యమకారులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయకుమార్, నూనె రాజేశం, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, మంథని డివిజన్ కన్వీనర్ గోగుల రాజు రెడ్డి, మంథని మండల అధ్యక్షులు కాసిపేట సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, కార్యదర్శి పల్లె రాజయ్య, మండల ఉపాధ్యక్షులు రోడ్డ లింగయ్య, మండల ఉపాధ్యక్షులు కండేల సమ్మయ్య పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడు శ్రీనివాసును అభినందించిన సీమ్యాట్ డైరెక్టర్



**పిఠాపురం :** ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొనుటలో శిక్షణ ఇచ్చుటకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి కొందరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను రాష్ట్ర విద్యాశాఖ ఎంపిక చేయడమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం పట్టణానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పోతుల శ్రీనివాసు ఎంపిక కాబడి, విజయవాడ సమీపంలోని అగిరిపల్లిలో గల హీల్స్ పేరడైజ్ లో ప్రస్తుతం (%ఎమ్ఖశ్రీం గ్ఖతీఖఎఅంవ%) శిక్షణ పొందుచున్నారు. శిక్షణలో భాగంగా ఏర్పాటు చేయబడిన సాంస్కృతిక కార్యక్రమంలో పి.శ్రీనివాసు దుర్యోధన ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ సీమ్యాట్ (%వా×జుహీూ%) డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య ఏకపాత్రాభినయాన్ని తిలకించి, అభినయంలో చక్కని ప్రతిభ కనబరిచిన శ్రీనివాసుని అభినందించారు. భాషా, సంస్కృతులు మన వారసత్వ సంపదలని వాటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని పిలుపునిచ్చారు. కళలు అంతరించిపోకుండా ఉండాలంటే వాటిని భావితరాలకు నేర్పించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు కూడా శ్రీనివాసుని అభినందించారు.

# సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ సందర్శించిన రామగుండం సీపీ



**సుల్తానాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్ సిబ్బందిని పిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యను తెలుసుకొని వారికీ భరోసా నమ్మకం కల్పించాలని చట్టపరిధిలో సమస్య పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సీపీ ఎస్ఐ శ్రవణ్ కుమార్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి, సమస్యాత్మక గ్రామాల, సరిహద్దు ప్రాంత వివరాలు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత ఎస్ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి అక్రమ రవాణా, సరఫరా, నిల్వ, సేవించే వారిపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు.

# ఆపరేషన్ సింధూర్‌లో దాగి ఉన్న అసలైన నిజాలను బహిర్గతం చేయాలి...




**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** ఈనెల 25న గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ లో దాగివున్న అన్ని కోణాల్లోని నిజాలను బహిర్గతం చేయాలని, ఫహేల్గాం హత్యలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను శిక్షించాలని, అలాగే ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతియుత చర్చలు ప్రారంభించాలని కోరుతూ, ఈ నెల 25న ఆదివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి సదస్సు జరుగనుంది. ఈ మేరకు సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ పెద్దపల్లి జిల్లా నాయకత్వం గోదావరిఖని ఐ ఎఫ్ టీ యు కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఈ నరేష్ మాట్లాడుతూ.. ఫహేల్గాం లో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ప్రజాస్వామ్య శక్తులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ సంఘటనపై భద్రత లోపాలపై సమగ్ర విచారణ జరగాలి. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పై అన్ని కోణాల్లో నిజాలను వెల్లడించాలి. ఇక, మావోయిస్టు సమస్యకు సైనిక పరిష్కారం కాదు %-% శాంతియుత చర్చలే మార్గమని మేము విశ్వసిస్తున్నాము. ఈ సమావేశంలో ఐ. కృష్ణ, ఐ. రాజేశం, గుండేటి మల్లేశం, ఈ. రామకృష్ణ, ఎం. దుర్గయ్య, ఎస్. రాజన్న, కాంపెల్లి మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

# పుట్ట మధు ఇప్పటికైనా నీ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరిక



**మంథని (ఆకాంక్ష న్యూస్ ) :** శుక్రవారం మంథని పట్టణంలోని మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సెల్ సమావేశంలో భాగంగా మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ నీ ఆరోపణలు సరికావని పెద్దపెల్లి జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఆరోపించారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు అక్బర్ అలీ, జమీల్ అహ్మద్ లు పుట్ట మధుకర్ మాట్లాడిన తీరుపై తీవ్రంగా ఖండించారు. గురువారం కాళేశ్వరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు చూస్తే చాలా విడ్డురంగా ఉందని, మంథని ప్రజలు ఒక్క సారి ఎమ్మెల్యే గా తప్పుదారిలో ఆకాశం కల్పిస్తే సద్వినియోగపరుచుకోకుండా అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించుకొని, అడ్డు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, దాడులకు ప్రేరేపించింది మీరు కాద అని విమర్శించారు. రాజకీయంగా వ్యక్తిగతంగా విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవాలి కానీ, ఐఏఎస్ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని తప్పుడు ఆరోపణలు మానుకోవాలని తీవ్రంగా హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుంటే మైనారిటీలుగా మేమందరం మీయొక్క వ్యక్తిగత జీవితంలోకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు. మంథనిలో గతంలో ఎమ్మెల్యే గా పనిచేసిన చంద్రుపట్ల రాంరెడ్డి తన ప్రత్యర్థుల గురించి వ్యక్తిగత జీవితంగా ఎన్నడూ మాట్లాడలేదని, రాజకీయ విమర్శలు చేశార అని వారిని చూసి పుట్ట మధు నేర్చుకోని జ్ఞానోదయం కలగాలని అన్నారు. ప్రభుత్వం సరస్వతి పుష్కరాల కొరకు అధిక నిధులు కేటాయించి అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటే లక్షలాధి మంది భక్తులు వచ్చి పుష్కర స్నానాన్ని ఆచరిస్తున్నారు. పుష్కారాల దగ్గర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కళ్ళు త్రగిన కోతి లాగ తప్పుడు కూతలు కోస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ... రాజకీయంగా పబ్బం గడుపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గారు , కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జనగామ నర్సింగరావు గారు , ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం గారు ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్ గారు ,మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ఏజాజ్,ముత్తారం మండల మైనార్టీ అధ్యక్షులు వాజిద్ పాషా ,వసియొద్దీన్ , యండి వలి, యండి నజీర్,మహబూబ్, అంతర్జాతీయ అవార్డు గ్రహీత ఖాజా మొయినోద్దీన్ మరియు ఖాజా మజారోద్దీన్, మరియు మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

# రామగుండంలో గర్భిణి స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు.

## మెడికల్ కళాశాలలో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్...





**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** గర్భిణి స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం రామగుండం వైద్య కళాశాలను పరిశీలించి గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాధారణ ప్రసవాల వైపు గర్భిణీ మహిళలను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కాన్పులో సిజేరియన్ ఆపరేషన్లు వీలైనంత వరకు తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా 100% పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు టీకాలు పూర్తి స్థాయిలో వేయాలని, కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణి మహిళలను ఆశా వర్కర్ల ద్వారా ఫాలో అప్ చేయాలని, పెయిన్ రాగానే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. గోదావరిఖని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, కాంప్లికేటెడ్ కేసులకు సైతం ఇక్కడ చికిత్స అందించే అవకాశం ఉందని అన్నారు. అంతర్గాం, పుట్నూరు, గోదావరిఖని , రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆశా వర్కర్ల ద్వారా జనరల్ ఆసుపత్రిలో ఉన్న వసతులను వివరిస్తూ ఇక్కడ అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రైవేట్ నర్సింగ్ హెూమ్ లోకి వెళ్లి ప్రజలు డబ్బులు వృధా చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో టిఫా స్కానింగ్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతి నెలా రామగుండం ప్రాంతంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజలు జనరల్ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం గోదావరిఖని లో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలనీ, మరియు శారదా నగర్ లోని నర్సింగ్ కళాశాలను సందర్శించి, తరగతి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమ బిందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, హెచ్. ఓ.డి.లు, డా.అరుణ, డా.శ్రీదేవి, ఆర్.ఎం.ఓ డాక్టర్ రాజు, డాక్టర్ లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య మహాభాగ్యం.

## రెండు కోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంగా యోగాంధ్ర




- **జూన్ 21 వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాలు**
- **కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు**

**విజయవాడ, ఆకాంక్ష :** మంచి ఆరోగ్యానికి మించిన సంపద లేదని అందుకే ప్రతిఒక్కరూ యోగాసనాలను అభ్యసిస్తూ ఆరోగ్య మహాభాగ్యాన్ని సొంతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు సూచించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు సత్యనారాయణపురం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోనూ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు యోగా విశిష్టతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆరోగ్యం గురించి శ్రద్ధ, ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మందికి యోగా నేర్పేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా: ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు.....**

ప్రధానమంత్రి ముఖ్యమంత్రి దార్శనికతకు రూపాలైన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తోందని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన కుటుంబాలు, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశం ఆరోగ్యంగా, సుసంపన్నంగా ఉంటుందని విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఓ మంచి ఆలోచనతో అమలుచేస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా యోగాను ప్రతిఒక్కరూ ఆచరించి.. మరో పదిమంది ఆచరించేలా చేయాలన్నారు. గౌరవ ప్రధాని చొరవ కారణంగా ఈరోజు మన చారిత్రక సంపద అయిన యోగాకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని.. దాదాపు 70 శాతం దేశాలు యోగాను అచరిస్తున్నాయని శాసనసభ్యులు ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఎన్ఎస్-ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నమూనా టెస్టు సద్వినియోగం చేసుకోండి:పి ఆర్ టి యు ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్.

**విజయవాడ,ఆకాంక్ష :** రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాలలో డీఎస్సీ 2025 ఉపాధ్యాయ అభ్యర్థులకు పి ఆర్ టి యు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 న నిర్వహించే మాక్ టెస్ట్ ను సద్వినియోగం చేసుకోవాలని పి ఆర్ టి యు ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని అభ్యర్థులకు బందరు రోడ్ లో ప్రతిభ కోచింగ్ సెంటర్ సహకారంతో పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా అభ్యర్థులు నమోదు చేసుకోవాలన్నారు. మాక్ టెస్ట్ కు సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ రమేష్ బాబుతో కలసి ఆవిష్కరించారు. టెస్ట్ కు సంబంధించి వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించాలన్నారు.

o91 94409 24009, o917989824415, o918897928566

ప్రతిభ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, పిఆర్టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అరాచకాలు సృష్టిస్తూ విర్రవీగిన వ్యక్తికి గుండెపోటు తెప్పించిన చరిత్ర టిడిపి కార్యకర్తలది: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- కృష్ణా జిల్లా మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే రాము
- గుడివాడ సమస్యలను. మహానాడు తీర్మానంలో పెట్టాలంటూ విజ్ఞప్తి
- సమస్యలపై ఏకగ్రీవ తీర్మానం చేసిన జిల్లా టిడిపి నాయకత్వం....



**గుడివాడ, ఆకాంక్ష:** గత ఐదేళ్లుగా అధికార మదంతో విర్రవీగుతూ చిన్న,పెద్ద అన్న తారతమ్యం లేకుండా నోటికి వచ్చినట్లు వాగుతూ అరాచకాలతో రాష్ట్ర పరువు, గుడివాడ పరువు తీసిన మాజీ ఎమ్మెల్యేకు గుండెపోటు తెప్పించిన చరిత్ర టిడిపి కార్యకర్తలదని ఎమ్మెల్యే వెనీగండ్ల రాము అన్నారు. మహానాడు అంటే టిడిపి శ్రేణులకు పెద్ద పండగ లాంటిదని ఆయన పేర్కొన్నారు.జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిర్వహించిన కృష్ణాజిల్లా మహానాడులో జిల్లా టిడిపి నాయకత్వం మరియు సహచర ఎమ్మెల్యేలతో కలిసి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం మధ్యాహ్నం పాల్గొన్నారు. మహానాడులో పాల్గొన్న జిల్లా నాయకత్వం మరియు సహచర ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే రాము ఉత్సాహంగా గడుపుతూ, సరదాగా మాట్లాడారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాము పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహానాడు సభ వేదికపై ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ మనందరికీ పండగ లాంటి టిడిపి మహానాడుకు ముందు జరుగుతున్న సన్నాక సమావేశంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. మనమందరం ఎన్టీఆర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల కోసం పనిచేద్దామంటూ ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. 43 ఏళ్లుగా ఎన్ని ప్రతికూలతలు వచ్చినా వెన్నుచూపకుండా ప్రజల పక్షాన పోరాడిన గొప్ప చరిత్ర టిడిపి కార్యకర్తలదని ఆయన పునరుద్ఘాటించారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంతో పాటుగా గుడివాడలో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గుడివాడలో సమస్యలు తిష్ట వేసుకున్నాయని చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ,పెద్ద సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. గుడివాడ సమస్యలపై జిల్లా టిడిపి నాయకత్వం చొరవ తీసుకొని, గుడివాడ సమస్యలను తీర్మానంలో పెట్టాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా గుడివాడ బస్టాండ్ సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కంకిపాడు రహదారికు నాలుగు కిలోమీటర్ల మేర మరమ్మత్తులు చేయకపోవడంతో సమస్య అలాగే ఉందని తక్షణవసరంగా గుర్తించి పామర్రు నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు కిలోమీటర్ల రహదారి మరమ్మత్తుకు అవసరమైన 90 లక్షల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా నందివాడ మండలంలో ఆక్వా ఫుడ్ ప్రాసెస్ యూనిట్,గుడివాడలో బీసీ ఫంక్షన్ హాల్, ముస్లిం సాధికార, నిర్మాణం ఎస్సీ స్మశాన వాటిక ఏర్పాటుతో పాటుగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలా, పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన 100ఎకరాల %ాజు% సెజ్ భూములను కేటాయిస్తూ తీర్మానం పెట్టాలని విజ్ఞప్తి చేశారు.మహానాడులో ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తులకు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు జిల్లా టిడిపి అధ్యక్షుడు కొనకల్ల నారాయణరావు ప్రకటించారు.కృష్ణాజిల్లా మహానాడు కార్యక్రమంలో ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి శుభాష్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడే ప్రసాద్, టిడిపి జాతీయ కార్యదర్శి వర్ల రామయ్య, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా పరిధిలోని టిడిపి నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# గిరిజన - దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి





**బాపట్ల, ఆకాంక్ష :** గిరిజన మరియు దివ్యాంగుల సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు.శుక్రవారం, స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లాలోని గిరిజన మరియు దివ్యాంగుల కొరకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మరియు దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. వేటపాలెంలో 60 మంది యానాది కులానికి చెందిన వారికి ఆలస్యపు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసియున్నారని, ఆధార్ ఎన్రోల్మెంట్ కొరకు కావలసిన డోమి సెల్ ధ్రువీకరణ పత్రాలు కోరుతూ వచ్చిన ఫిర్యాదునకు ఆయన స్పందించి వెంటనే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వేటపాలెం తహసిల్దార్ ను ఆయన ఆదేశించారు. అక్కయ్యపాలెం పంచాయతీలో 300 యానాదుల కుటుంబాలకు స్మశానం కొరకు స్థల సేకరణ చేసి నివేదిక అందించాలని వేటపాలెం తహసిల్దార్ ను ఆయన ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం,సమస్యల పరిష్కారం కొరకు వారంలో 3 రోజులు( సోమ,మంగళ,బుధవారం) బాపట్ల జిల్లాలో విధులు నిర్వహించాలని సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. వారి కొరకు స్థానిక కలెక్టరేట్ ఆవరణలో కార్యాలయమును ఏర్పాటు చేయడమైనది ఆయన అన్నారు. మిగిలిన 3 రోజులు ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించుకోవలసినదిగా ఆయన ఎ.డి వికలాంగుల శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగుల కొరకు ఉన్నటువంటి 5% కోట అమలు జరుగుతుందో లేదో చూడాలని, అదేవిధంగా కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ విధానంలో కూడా 5% ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏడిని ఆదేశించారు. జిల్లాలో దివ్యాంగుల కొరకు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో 5% షాపులు కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. 16 మంది ట్రాన్స్ జెండర్ లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 42 వేల మంది ఉద్యోగులు ఉండగా ఇప్పటివరకు కేవలం 6 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేశారన్నారు. మిగిలిన వారందరూ వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రజల చేత కూడా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అదేవిధంగా యోగా టీచర్లను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.ఎక్కువ మంది యోగాంధ్రలో పాల్గొనే విధంగా చూడాలని జిల్లా అధికారులను, తాసిల్దార్లను,ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెంచన్లు పంపిణీ చేసిన తర్వాత మిగిలి మొత్తంను 5వ తేదీలోపు ప్రభుత్వానికి చలానా రూపంలో జమ చేయాలన్నారు. అలా జమ చేయని వారి వద్ద నుండి వడ్డీతో వసూలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్,బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్ రావు, సహాయ సంచాలకులు వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, ఇతర జిల్లా అధికారులు వీక్షణ సమావేశం ద్వారా రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు,తాసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఉత్తర్వులు జారీ



**మచిలీపట్నం, ఆకాంక్ష :** జిల్లాలో యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సంవత్సరపు అంతర్జాతీయ యోగా దినోత్సవం ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా.. అనే థీమ్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసం నిర్వహించాలని ఆదేశించిన నేపథ్యంలో జిల్లాలో యోగాంధ్ర ప్రచారం-2025 కింద వివిధ కార్యక్రమాలు, పోటీలను సముచిత రీతిలో నిర్వహించడానికి ప్రభుత్వం సూచించిన విధంగా జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లాస్థాయి యోగా శిక్షకులు, మండలాల వారీగా మాస్టర్ ట్రైనీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.యోగ సాధనపై అవగాహన కనీసం రెండు కోట్ల మందిని చేరుకోవాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని, ఈ మేరకు జిల్లాలోని అన్ని స్థాయిలలో యోగా సాధన శిబిరాలు నిర్వహించాలన్నారు.జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా జిల్లా ఎస్పీ, నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కన్వీనర్ గా, ఇతర అధికారులు కో కన్వీనర్, సభ్యులుగా మొత్తం 24 మంది కమిటీలో ఉంటారన్నారు. ఈ కమిటీ జిల్లా స్థాయిలో యోగ్యాంధ్ర 2025 కింద యోగాను నిర్వహించడం, జిల్లాలోని అన్ని స్థాయిలలో చేపట్టిన వివిధ కార్యకలాపాలను పర్యవేక్షించడం, గరిష్ట సంఖ్యలో ప్రజలు నమోదు చేసుకుని శిక్షణ పొందుతున్నారని నిర్ధారించుకోవడం జిల్లా స్థాయి నిర్వాహక కమిటీ మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు.మండల స్థాయి కమిటీలో పట్టణంలో మున్సిపల్ కమిషనర్, గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీవో చైర్మన్ గా, ఎంఈఓ కన్వీనర్ గా, ఇతర అధికారులు కో కన్వీనర్, సభ్యులుగా మొత్తం 9 మంది ఉంటారన్నారు. గ్రామ స్థాయి కమిటీలో గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, వార్డులో అడ్మిన్ సెక్రటరీ చైర్మన్ గా, వీఆర్వో, ప్రధానోపాధ్యాయులు, పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల గ్రామ సహాయకులు, ఏఎన్ఎంలు తదితరులు కన్వీనర్, కో కన్వీనర్, సభ్యులుగా మొత్తం 8 కమిటీలో ఉంటారని అందులో పేర్కొన్నారు జిల్లా స్థాయిలో షెడ్యూల్ ప్రకారం మాస్టర్ ట్రైనర్లకు యోగా శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్ (టిఓటిలు)గా వైద్యాధికారులు డాక్టర్ ఆర్ పోతన శాస్త్రి, డాక్టర్ శ్రీధర్ బాబులను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నియమించారు.అలాగే మండల స్థాయిలో 56 మంది వ్యాయామ ఉపాధ్యాయులను మాస్టర్ ట్రైనర్లుగా కూడా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నియమించారు.యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని 4 వారాలుగా విభజించామని, ప్రతి వారం ఒక నిర్దిష్ట స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విధులు కేటాయించబడిన అధికారులందరూ ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు యోగా శిక్షణకు హాజరు కావాలని, వైద్య ఆరోగ్య శాఖ షెడ్యూల్ ప్రకారం తెలియజేసిన యోగా ప్రోటోకాల్ ప్రకారం గ్రామ, వార్డ్ స్థాయి శిక్షకులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బంది అందరూ శిక్షణలకు హాజరు అయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు.అధికారులందరూ వారి పరిధిలో కేటాయించిన అన్ని విధులకు హాజరు కావాలని, ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలను పాటించాలని, అన్ని కార్యక్రమాలు తగిన విధంగా నిర్వహించి యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

# ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ లో సీటు సాధించిన కొమ్మారెడ్డి విద్యార్థిని




**బంటుమిల్లి, ఆకాంక్ష :** గత నెల 25-04-2025 న జరిగిన ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో కొమ్మారెడ్డి పాఠశాల 4 వ తరగతి విద్యార్థిని యడవల్లి ఆశ్రిత ( %ఎ.ఎ. చీశీ%. 2511750352 ) స్టేట్ 4123 ర్యాంకు సాధించి నిమ్మకూరు, కృష్ణా జిల్లా మరియు ముసునూరు, ఎన్.టి.ఆర్ జిల్లాల లో గల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నందు అడ్మిషన్ పొందుటకు అర్హత సాధించింది.ఇంతటి అత్యద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని యడవల్లి ఆశ్రితను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ శ్రీ కొమ్మారెడ్డి కిషోర్ గారు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, పాఠశాల %ఎ.వీ%. ఎన్. శ్రీనివాసరావు అభినందించారు.

# ఈ సెట్ పరీక్షల్లో గుడివాడ వికాస్ రెయిన్బో పాఠశాల పూర్వ విద్యార్థినికి 57వ ర్యాంక్



**గుడివాడ, ఆకాంక్ష :** గురువారం విడుదలైన 2025 ఈ సెట్ పరీక్ష ఫలితాలలో గుడివాడ వికాస్ రెయిన్బో పూర్వ విద్యార్థిని అద్భుత ప్రతిభ చూపి సంచలన ర్యాంకు సాధించింది. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈసెట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 57వ ర్యాంకు సాధించిన పాఠశాల విద్యార్థిని తురక మోనాలిసాను సత్యనారాయణపురంలోని వికాస్ రెయిన్బో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పుట్టి రామచంద్రశేఖర్ మరియు అధ్యాపకులు శుక్రవారం ఉదయం అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామచంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంతో పోటీ తత్వం కలిగిన ఈసెట్ పరీక్షల్లో తమ పాఠశాల పూర్వ విద్యార్థిని మోనాలిసా 57వ ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు.మోనాలిసాను ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమిక దశలోనే వికాష్ రెయిన్బో పాఠశాలలో నేర్పిన అంశాలు తనకు ఇప్పుడు ఎంతో ఉపయోగపడుతున్నాయని విద్యార్థిని మోనాలిసా పేర్కొన్నారు. కరస్పాండెంట్ రామచంద్రశేఖర్, అధ్యాపకులకు మోనాలిసా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం అరుణ, ప్రైమరీ హెచ్.ఎం వాణి, బయాలజీ సీనియర్ ఫ్యాకల్టీ విజయ్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాందేవ్ రావు ఆసుపత్రి సీఈవో డాక్టర్.యోబు జన్మదిన వేడుకలు



**కూకట్పల్లి, మే23, ఆకాంక్ష :** కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని రాందేవ్ రావు ఆసుపత్రి సీఈఓ డాక్టర్.యోబు జన్మదిన వేడుకలు హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్స్,అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది,కూకట్పల్లి జర్నలిస్టుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్.యోబు మాట్లాడుతూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి పుట్టి నగేష్, జాయింట్ సెక్రెటరీ నాగుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు వార్డులోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలి

*విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు*



**విజయవాడ, ఆకాంక్ష:** వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు వార్డులోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలి అని అన్నారు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో ని నూతన భవనం లో గల మీటింగ్ హాల్ నందు వార్డ్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు, వార్డ్ లో ఉన్న ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలని అక్కడున్న సచివాలయం సిబ్బందితో అవార్డులో గల సమస్యలన్నీ తెలుసుకొని తక్షణమే పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని, శాఖల మధ్య సమన్వయం తో గల సమస్యలను స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన ఆ సమస్యను పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు తాము ఏ శాఖకు సంబంధించిన, వార్డులో గల ప్రతి శాఖకు సంబంధించిన సమస్యపై వారి చర్యలు తీసుకునేటట్టు ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథరెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్స్ సంజయ్ రత్నకుమార్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సూపరింటెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యకుమారి, పి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, వార్డ్ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఫ్రైడే తో మలేరియా డెంగ్యూ దూరం:విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆకాంక్ష :** ఫ్రై డే డ్రై డే పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, భాను నగర్ వద్ద ఫ్రై డే- డ్రై డే అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇంటి లోపల, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా గుర్తింపు నిర్వహించి, వ్యాధుల సంక్రమణ పై అవగాహన కల్పించారు.మలేరియా, డెంగ్యూ వ్యాధులకు కారకాలైన దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వ్యాప్తికి కారకాలైన దోమల ప్రబలకుండా వాటి వ్యాప్తిని అరికట్టాలన్నారు మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని సిబ్బంది అక్కడ ఉన్న ప్రజలకు తెలిపారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం దానిలో ప్రజలందరూ భాగస్వామ్యులు అవ్వడం ద్వారా మలేరియా , డెంగ్యూ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు మనమందరం సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్య నాయక్, అధికారులు, సిబ్బంది,హెల్త్ అసిస్టెంట్లు,ఏ.ఏన్.ఏమ్ లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసిల్టింగ్ పనులు పూర్తిస్థాయిలో జరగాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



**విజయవాడ, ఆకాంక్ష :** నగరంలో డీజిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వెహికల్ డిపో, రైల్వే స్టేషన్, జండా చెట్టు, నైజాం గేట్ గాంధీ హిల్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద గల ఔట్ఫాల్ డ్రైన్లను, ఎంజీ రోడ్, బి ఆర్ పి రోడ్, నెహ్రూ రోడ్, లో బ్రిడ్జి ప్రాంతం, గణపతిరావు రోడ్ ప్రాంతాలన్నీ పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో రోడ్లపైన నీరు నిల్వ ఉండకుండా ఖచ్చితంగా ప్రతిరోజు డిసిల్టింగ్ పనులను చేస్తూ, నగరంలోని డ్రైన్ లలో డీసిల్టింగ్ పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఎస్కలేటర్ ను పెట్టి ఫ్లోటింగ్ గార్బేజ్ ను త్వరితగతిన తీయించాలని, డ్రైన్ పైనున్న స్లాబ్ ని తీసేసి డీసిల్టింగ్ ప్రక్రియ సజావుగా చేసేందుకు గ్రిల్ పెట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సానిటరీ సూపర్వైజర్ ఓమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వందేళ్లయినా కెసిఆర్ ఫ్యామిలీ అంతా ఒక్కటే

### లేఖను సృష్టించాల్సిన పని రేవంత్‌కు ఎందుకు?

### బిఆర్ఎస్ డ్రామాలో భాగమే కవిత లేఖ: కోమటిరెడ్డి



**హైదరాబాద్,మే 23(ఆకాంక్ష ):** ఆర్టిఫిషియల్ లేఖను కూడా ఎమ్మెల్సీ కవిత సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ- చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాసకు భవిష్యత్తు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసినట్లు- బయటకు వచ్చిన లేఖపై ఆయన స్పందించారు. ఆ లేఖ.. ఓ జోక్ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ రాసే లేఖ ఓ పద్ధతిగా ఉందా? ఆ లేఖను సృష్టించాల్సిన అవసరం మాకేంటి? భారాసలో చీలిక ఏమీ లేదు.. ఇదంతా ఓ డ్రామా. దానిలో భాగమే ఈ లేఖ. తండ్రికి లేఖ రాయాల్సిన అవసరమేంటి? ఆమె నేరుగా చెప్పొచ్చు కదా! కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? వారు గొడవపడరు.. ఒకవేళ అలా జరిగితే అది ఆస్తుల గురించే అవుతుందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

## యోగాంధ్రలో జిల్లాను నెం.1గా నిలుపుదాం

### జిల్లాలో 10-15 లక్షల మందికి యోగా నేర్పే లక్ష్యంతో కార్యక్రమాలు

- దాదాపు 2,500 మంది యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకుంటాం
- గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో రోజూ ప్రత్యేక కార్యక్రమాలు
- 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌తో థీమ్ ఆధారిత యోగాభ్యసన
- వ్యక్తిగత, గ్రూపు విభాగాల్లో యోగాపై పోటీల నిర్వహణ
- పోటీల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీల ఏర్పాటు




**విజయవాడ, ఆకాంక్ష :** వికసిత్ భారత్ స్ఫూర్తితో వెల్త్, హెల్త్, హ్యాపీ స్వర్ణాంధ్ర సాకారానికి పునాది పడేలా యోగాంధ్ర మాసోత్సవాలను ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని.. మీడియాతో పాటు ప్రతి వర్గం సమష్టి భాగస్వామ్యంతో ఎన్‌టీఆర్ జిల్లాను యోగాంధ్రలో నెం.1గా నిలిపేందుకు కృషిచేద్దామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి థీమ్ ఆధారిత యోగాంధ్ర మాసోత్సవాలపై శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని, కనీసం రెండుకోట్ల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో వీటిని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో దాదాపు 10 లక్షల నుంచి 15 లక్షల మందికి యోగాను నేర్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం దాదాపు 2,500 మంది యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకోనున్నామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఏడు ట్రైనర్లు అందుబాటులో ఉంటారని.. ఒక్కో ట్రైనర్ ఒక సెషన్‌కు 50 మందితో యోగాభ్యసనం చేయించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర నిర్వహణలో జిల్లాను ఆదర్శవంతంగా నిలిపేందుకు ప్రతిఒక్కరం కృషిచేద్దామన్నారు. గౌరవ ప్రధాని చొరవతో యోగా విశ్వవ్యాప్తమైందని, ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయని.. ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు గౌరవ ప్రధాని హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

### థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు:

మన భారతీయ వారసత్వ, సాంస్కృతిక సంపద అయిన యోగాను ప్రతిఒక్కరూ ఆచరించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించేందుకు జిల్లాలోనూ నెల రోజుల పాటు థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 24న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో కార్యక్రమం ప్రారంభమై మే 25న జేఏసీ నేతలు, ప్రభుత్వ ఉద్యోగులు, మే 26న పోలీస్-హెూంగార్డ్స్, మే 27న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మే 28న ఆటో, లారీ డ్రైవర్లు, మే 29న క్రీడాకారులు, మే 30న కళాకారులు, మే 31న రైతులు, జూన్ 1న విద్యార్థులు, జూన్ 2న పారిశుద్ధ్య కార్మికులు, జూన్ 3న కార్మికులు, జూన్ 4న మాజీ సైనికులు, జూన్ 5న విభిన్న ప్రతిభావంతులు, జూన్ 6న లాయర్లు, జూన్ 7న స్వయం సహాయక సంఘాల సభ్యులు, జూన్ 8న నర్సింగ్ సిబ్బంది, జూన్ 9న ఉపాధ్యాయులు, జూన్ 10న ఉపాధిహామీ శ్రామికులు, జూన్ 11న అంగన్వాడీ, హెల్త్ వర్కర్లు, జూన్ 12న వైద్యులు, జూన్ 13న మహిళా పారిశ్రామికవేత్తలు, జూన్ 14న ఆటో టెక్నీషియన్లు, జూన్ 15న మత్స్యకారులు, జూన్ 16న కాలేజీ విద్యార్థులు, జూన్ 17న సీనియర్ సిటిజన్స్, స్వాతంత్ర్య సమరయోధులు, జూన్ 18న దేవాలయ ఉద్యోగులు, జూన్ 19న ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులు, జూన్ 20న సెలబ్రిటీలతో థీమ్ ఆధారిత 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌తో యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలో బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు గ్రామ, మండల, డివిజన్, మునిసిపల్, జిల్లాస్థాయిలో ప్రతిరోజూ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు కూడా యోగా ఔన్నత్యంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గాంధీ హిల్, భవానీ ద్వీపం, డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం, కొండపల్లి ఖిల్లా తదితర ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగాచరణను జీవితాంతం తమ జీవనశైలిలో భాగం చేసుకొని ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు.

### ప్రత్యేక పోటీల నిర్వహణ:


యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్, మండల స్థాయిలో యునిటీ త్రో యోగా, జిల్లాస్థాయిలో యోగా అండ్ యూత్ ఇతివృత్తాలతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, విజేతలకు అవార్డుల బహూకరణ ఉంటుందన్నారు. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన (స్టాటిక్, డైనమిక్), సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామ ప్రదర్శన, మెడిటేషన్ అంశాల్లోనూ గ్రూప్ కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా పోటీలు ఉంటాయన్నారు. ఆర్టిస్టిక్ యోగాలో యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే ఉంటాయన్నారు. అదేవిధంగా యోగా క్విజ్, యోగా పోస్టర్, స్లోగన్ రూపకల్పనతో పాటు యోగాపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ అంశాల్లోనూ పోటీలు నిర్వహించనున్నామని.. పోటీల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సమావేశంలో జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారులు డా. ఎం.సుహాసిని, డా. జె.సుమన్, జిల్లా ఆయుష్ అధికారి డా. రామలైహి, ఆయుష్ వైద్యాధికారులు డా. వి.రాణి, డా. వై.రత్న ప్రియదర్శిని, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, యోగా ట్రైనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దేశీయ జల మార్గాలు జల రవాణాకు అనుకూలం.

### జెడ్. శివప్రసాద్, చైర్మన్, ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ.....

- జల రవాణా రోడ్డు, రైల్ రవాణా కంటే ఖర్చు తక్కువ
- పోర్టుల అనుసంధానంతో యువతకు మరిన్ని ఉద్యోగాలు
- దేశ ఆర్థిక వ్యవస్థలో జల రవాణా కీలక పాత్ర వహిస్తుంది
- జల రవాణాలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి

**విజయవాడ, ఆకాంక్ష :** రాష్ట్రంలో జల మార్గాల అనుసంధానంతో జల రవాణా సులభతరం అవుతుందని అందుకు నా వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ జెడ్. శివప్రసాద్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ గా డాక్టర్ జెడ్. శివప్రసాద్ శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో సంస్థ కార్యాలయంలో సంస్థ సీఈవో జీవీ. రాఘవరావు సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజనరీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాకు మార్గదర్శి ఐటీ, విద్యా శాఖ ల మంత్రి నారా లోకేష్ లు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు ఇవ్వటం సంతోషంగా ఉందని, అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. జల రవాణా లాంటి మంచి ప్రాజెక్టు బాధ్యతలను నాకు ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. నా శక్తి వంచన లేకుండా ఇందుకు పనిచేస్తానన్నారు. తక్కువ ఖర్చుతో దేశీయ జల మార్గం ద్వారా రవాణా, కార్గో చాలా సులభతరం అవతుందన్నారు. జల మార్గంతో రవాణా చేయడం వల్ల రోడ్లపై ట్రాఫిక్ తగ్గుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.రాష్ట్రంలో 960 కి.మీ ల పొడవు గల సముద్ర తీర ప్రాంతం ఉందని జల రవాణాకు ఇది ఎంతో అనుకూలమన్నారు. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో జల రవాణా కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. సాగరమాల ప్రాజెక్టుకు అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. పాశ్చాత్య దేశాలు జల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. జల రవాణాలో ఉన్న ఇబ్బందులను తొలగించి సంస్థను పురోభివృద్ధిలో పయనించేలా కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రోత్సాహంతో సంస్థను ముందుకు తీసుకెళ్లతామన్నారు. పోర్టు లు అనుసంధానం ద్వారా మరిన్ని ఉద్యోగాలు యువత కు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీని పై దృష్టి పెట్టటం సంతోషంగా ఉందన్నారు. జల రవాణా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వానికి నావంతు సహకారం అందిస్తానన్నారు.. జల రవాణాలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని డాక్టర్. జెడ్. శివప్రసాద్ తెలియజేశారు.



## నేనూ ఈడి బాదజతుడినే:శివసేన ఎంపి సంజయ్ రౌత్

**ముంబయి,మే 23(ఆకాంక్ష ):** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడి బాధితుల్లో తానూ ఉన్నానని శివసేన ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. బిజెపి మరియు ప్రధాని మోడీల ఆయుధమని రౌత్ వ్యాఖ్యానించారు. తన నివాసంపై కూడా ఈడి దాడులు నిర్వహించిందని, తాను ఈడి బాధితుడినని అన్నారు. తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రాష్ట్ర మార్కెటింగ్ కార్పోరేషన్ (టిఎఎస్ఎంఎసి)పై మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడి దర్యాప్తును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. కేంద్ర ఏజన్సీ అన్ని పరిధులను దాటుతోందని, సమాఖ్య నిర్మాణాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై శుక్రవారం సంజరురౌత్ మీడియాతో మాట్లాడారు. 'సుప్రీం పేర్కొన్నట్లు ఈడి అన్ని హద్దులను దాటుతోంది. నేను కూడా ఈడి బాధితుడినే. నాలాంటి వారు చాలామంది ఉన్నారు. ఈడి అనేది బిజెపి, ప్రధాని, అమిత్‌షాల ఆయుధం. ఈడి ఉన్నంత కాలం మోడీ-షాల ద్వయం, బిజెపి ఉంటాయి' అని అన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్‌ని రాహుల్ గాంధీ ప్రశ్నించడంపై కూడా సంజయ్ రౌత్ స్పందించారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలో తప్పు లేదని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. రాహుల్ మాత్రమే కాదు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు తెలుసుకోవాల్సి ఉందని అన్నారు.



# పింఛన్ల పంపిణీ కార్యక్రమం పనితీరు మెరుగుపరచుకొని ది సజావుగా విధులు నిర్వహించాలి:జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, ఆకాంక్ష : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల నుండి ప్రతికూల స్పందన వస్తుందని, పనితీరు మెరుగుపరచుకొని వారితో మర్యాదగా వ్యవహరించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పింఛను పంపిణీ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో డి ఆర్ డి ఏ పి డి హరిహరనాథ్ తో కలిసి పింఛను పంపిణీ అధికారులతో కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రతినెల అధికారులు ఐ వి ఆర్ ఎస్, 1100 కాల్ సెంటర్ ద్వారా ఎన్టీఆర్ భరోసా పింఛను




లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని తీసుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో కనీసం 5 మంది లబ్ధిదారుల స్పందనను తెలుసుకుంటున్నారన్నారు .జిల్లాలో గత మూడు నెలలుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పై పింఛన్దారులలో ప్రతికూల స్పందన వస్తోందన్నారు. అందుకు గల కారణాలు సకాలంలో పింఛను ఇస్తున్నామా లేదా నగదు మొత్తం కచ్చితంగా ఇస్తున్నామా లేదా సమయానికి ఇవ్వలేకపోతే వారికి నచ్చజెప్పి. మర్యాదపూర్వకంగా మాట్లాడుతున్నారా లేదా ప్రతి ఒక్కరూ విశ్లేషించుకోవాలన్నారు రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ విషయమై చాలా తీవ్రంగా పరిగణిస్తూ లబ్ధిదారుల నుండి ప్రతికూల ప్రభావం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఇకనైనా ప్రతికూల స్పందనలు పునరావృతం కాకుండా ఇదే మొదటి, చివరి హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుండి పనితీరు మెరుగుపరచుకొని సజావుగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పింఛన్ల ఏపీఓ సతీష్, పలువురు పింఛన్ పంపిణీ అధికారులుగా ఉన్న గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జిల్లా స్థాయి మినీ మహానాడు



నూజివీడు,ఆకాంక్ష : ఏలూరు జిల్లా స్థాయి మినీ మహానాడు నూజివీడు పట్టణ అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నూజివీడు మార్కెట్ యార్డులో తెలుగుదేశం కుటుంబ సభ్యుల మధ్య ఎంతో వైభవంగా జరిగింది,ఏలూరు జిల్లా స్థాయి మీనీ మహానాడులో నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం కొన్ని తీర్మానాలు జరిగాయి, నూజివీడు నియోజకవర్గాన్ని ప్రజల సౌకర్యార్థం ఏలూరు జిల్లా నుండి ఎన్, టి, ఆర్, జిల్లాలో విలీనం చేయాలని తీర్మానించారు, చాట్రాయి మండలం పిట్టలవారి గూడెం ఎతుపోతల పథకం పూర్తి చేయాలని తీర్మానించారు, నూజివీడు పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని, నూజివీడు మార్కెట్ యార్డు సుమారు రూ. 30 కోట్లతో అభివృద్ధి చేయాలని, నూజివీడు పట్టణంలో గల పెద్ద చెరువు కొంత భాగం త్రాగునీటి కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం డా??వై, ఎస్, ఆర్, ఆర్టికల్చర్ లో ఉన్నందున సదరు పరిశోధన కేంద్రానికి 20 ఎకరాల భూమిని కేటాయించాలని, నియోజకవర్గంలో బ్రహ్మలింగం, మీర్జాపురం, వెంకన్న, సగ్గురు, కొమ్మూరు, చెరువులలో సామర్థ్యాన్ని పెంచి తద్వారా త్రాగు, సాగు నీరు అభివృద్ధి చేయాలని తీర్మానించారు, నూజివీడు మున్సిపాలిటీకి అండర్ డ్రైనేజి నిర్మాణం, కృష్ణా జలాల నూజివీడు నియోజకవర్గములోని నాలుగు మండలాలకు అందేలా చర్యలు చేపట్టాలని,నూజివీడు నియోజకవర్గంలో సాగుచేసుకొంటున్న అటవీ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు, చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సూచనల మేరకు జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు, గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించినప్పటికీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలు, కూటమి ప్రభుత్వ పరిపాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని, రాష్ట్రంలో ఎక్కడైనా రైతులు సమస్యలు ఎదుర్కొంటుంటే సంబంధిత శాసనసభ్యులు, శాఖ మంత్రి స్వయంగా వెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత రెండు వ్యవసాయ సీజన్లలో రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేసి, 24 గంటలలోగా రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేశామన్నారు. గత ప్రభుత్వం ధాన్యం సొమ్ముని రైతులకు 21 రోజులలో జమచేస్తామని చెప్పి, 6 నెలల వరకు కూడా జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బ్రాండ్ ఇమేజ్ తో రాష్ట్రంలోని పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని,బహుళ జాతి పారిశ్రామికవేత్తలు సంస్థలను ఏర్పాటుచేయడంతో లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు వీలుకలుగుతుందని, దీంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పెద్దచెరువు ను పటిష్టం చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి హామీ ఇచ్చారని, రానున్న వర్షాకాలంలో నూజివీడులో పెద్దచెరువు పటిష్టం చేస్తామన్నారు. పేదలు తలెత్తుకొని జీవించేలా చేసింది అన్న ఎన్, టి, ఆర్, సినీ రంగంలో నట విఖ్యాతగా పేరు గాంచి ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినీ రంగానికి పేరు తెచ్చి పార్టీ స్థాపించి పేద ప్రజలకు విశేష సేవలు అందించిన గొప్ప నాయకుడు అన్న ఎన్, టి, ఆర్, పేదవాడు తలెత్తుకొని జీవించేలా చేసింది అన్న ఎన్, టి, ఆర్, మహిళలకు అస్తి హక్కు,రాజకీయల్లో రిజర్వేషన్ కేటాయించి, మహిళల్లో చైతన్యం తీసుకొచ్చిన మహానుభావుడు అన్న ఎన్, టి, ఆర్, అన్నారు. అదేవిధంగా దేశ రాజధాని ఢిల్లీలో తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ,పేరు ప్రఖ్యాతులను తెచ్చిన ఘనుడు అన్న ఎన్, టి, ఆర్, తెలుగు వారికి ఎటువంటి కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి అన్న ఎన్, టి, ఆర్, అన్నారు. బడుగు బలహీన వర్గాలను చట్టసభల్లోకి పంపి ఆత్మగౌరవం పంపిన గొప్ప నాయకుడు అన్న ఎన్,టి, ఆర్. ఆశయాలు ,లక్ష్యాలను, సాధించడానికి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్న మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని అన్నారు. రానున్న 5 సంవత్సరాల్లో ప్రతీ పేదవాడికి పక్కా ఇళ్లు కట్టించే భాద్యత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. రానున్న మార్చి నుండి ఇళ్ళు కట్టుకొనే వారికి రూ,2.50 లక్షలు అందిస్తున్నామన్నారు. త్వరలో ఇళ్ళు స్థలం లేని వారికి అర్బన్ పరిధిలో 2 సెంట్లు, రూరల్లో 3 సెంట్ల భూమిని అందజేస్తామన్నారు, రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు, గతంలో కేటాయించిన ఇళ్ళ స్థలాలు నిర్మాణ యోగ్యం కాని వారికి మరలా స్థలాలు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు ,యువ నాయకులు మంత్రి నారా లోకేష్ బాబు చొరవతో ముంబాయి నుండి రిలియన్స్, మరియు అనేక బహుళ జాతి పరిశ్రమలు రాష్ట్రానికి తరలి వచ్చాయన్నారు,పరిపాలనా దక్షుడు నిరంతర శ్రామికుడు అనుభవం గల మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపుతో అనేక బహుళ జాతి పరిశ్రమలు రాష్ట్రంలో నెలకొల్పుతున్నామని తద్వారా లక్షల్లో ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. త్వరలో అమరావతి రాజధాని నిర్మిస్తామని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటు పరం కాకుండా కాపాడమని,ప్రభుత్వమే పరిశ్రమను నడుపుతుందని తెలియజేసారు. ప్రభుత్వం ప్రజల యొక్క సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అన్న ఎన్, టి, ఆర్,దయతో బి, సి, ఎస్, సి, వర్గాల వారు మహిళలు చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు, ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చిన అన్ని విధాలుగా ఆదుకోవడానికి నియోజకవర్గములో నేను రాష్ట్రంలో ప్రభుత్వం ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో,ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏలూరు శాసన సభ్యులు,ఎమ్, ఎల్, సి, రాజేంద్రప్రసాద్, బడేటి చంటి, చింతలపూడి శాసన సభ్యులు ఎస్, రోషన్ కుమార్, దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్,మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ, తెలుగుదేశం ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులకు భరోసా ఇచ్చిన మంత్రి కొలుసు పార్థసారధి.

## భాస్కర్ కుటుంబానికి లక్ష సాయం అందజేసిన మంత్రి కొలుసు పార్థసారధి.....

నూజివీడు, ఆకాంక్ష : రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గత వారం చాట్రాయి మండలంలో పర్యటనకు వెళ్లి తిరిగి రోడ్డు మార్గంలో వస్తుండగా నూజివీడు మండలం పోతిరెడ్డి పల్లి బైపాస్ జంక్షన్లో రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో, లారీని చూసి వెంటనే కాన్వాయిని ఆపి ప్రమాదానికి గల కారణాలు వారి వివరాలు తెలుసుకొని బాధితులకు భరోసా ఇచ్చిన మంత్రి ఈ ప్రమాదంలో పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జి, భాస్కర్ ఆటో పూర్తిగా ధ్వంచ్చం అవ్వగా మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి భాస్కర్ ను పరామర్శించి,ధైర్యం చెప్పి అండగా నీనున్నానని మంత్రి అన్న ఒక వారంలో మాట నిలబెట్టుకున్నారు,మంత్రి వర్యులు ప్రమాదానికి కారణమైన లారీ యజమానితో మాట్లాడి బాధిత కుటుంబానికి మంత్రి, లారీ యజమాని ఇరువురు కలిసి సుమారు రూ,1 లక్ష ఆర్థిక సహాయం సొంత నగదు అందించారు,మరియు సోడా బట్టి ప్రమాదంలో ధ్వంసం అవడంతో రూ,20 వేల ఆర్థిక సహాయం అందించిన మంత్రి కొలుసు పార్థసారధి, ప్రభుత్వం తరపున కొత్త ఆటో ఇప్పించే బాధ్యత కూడా నాది అని భరోసా ఇచ్చారు, అంతే గాక బి, సి.కార్పొరేషన్ నుండి కొంత ఆర్థిక సహాయం త్వరలో మంజూరు చేయించాలని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కినేని చందూకు చూసించారు. భాస్కర్ కుటుంబానికి ప్రభుత్వం నుండి అందే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా నా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు, భాస్కర్ కుటుంబానికి అండగా



ఉండాలని తక్షణమే సహాయ సహకారాలు అందేలా చూడాలని తెలుగుదేశం నాయకులైన వారికి, ఆదేశించిన మంత్రి, చేసిన ఆర్థిక సహాయం చొరవతో తమ కృతజ్ఞతను,హర్షాన్ని తెలియజేసిన ,బాధిత కుటుంబ సభ్యులు. మంత్రి వెంట గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కినేని చందు, ఇతర పెద్దలు తదితరులు ఉన్నారు.

# బంగ్లాదేశ్‌లో మరోమారు అనిశ్చితి

## సైన్యాధ్యక్షుడు వకారుజ్జమాన్‌తో విభేదలు తీవ్రం

## రాజీనామాకు సిద్దపడ్డ తాత్కాలిక అధ్యక్షుడు మహ్మద్ యూనస్

ఢాకా,మే 23(ఆకాంక్ష): బంగ్లాదేశ్మరోమారు సంక్షోభం అంచుకు చేరింది. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఇంకెంతో కాలం మనజాలదని పరిస్థితులు రుజువు చేస్తున్నారు. దీనికితోడు సైన్యంతో పొసగక బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మమద్ యూనస్ తన పదవికి రాజీనామా చేస్తారనే చర్చ సాగుతోంది. దేశంలో తాజాగా రాజకీయ అస్థిర పరిస్థితులు నెలకున్నాయి. అలాంటి వేళ.. ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం రావడంతో విఫలమవ్వడం వల్లే ఆయన ఈ నిర్ణయానికి వచ్చి ఉండవచ్చని స్థానిక మీడియా తన కథనంలో వెల్లడించింది. ఈ అంశంపై నేషనల్ సిటిజన్ పార్టీ నాయకుడు నిద్ ఇస్లాం స్పందించారు. గురువారం ఉదయం నుంచి మహ్మమద్ యూనస్ రాజీనామా చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో కలిసి మాట్లాడినట్లు చెప్పారు. రాజీనామా అంశంపై ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగేలేనని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. గత రెండు రోజులుగా యూనస్ ప్రభుత్వం పలు సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. వాటిలో ఏకీకృత మిలటరీ దళాలు అంశం ఒకటి అని వివరించారు. గతేడాది దేశంలో విద్యార్థుల తిరుగుబాటులో ఇవి కీలక భూమిక పోషించాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే దేశ భద్రత దృష్ట్యా కొనసాగాలని తాను కోరానని.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మరోవైపు తాత్కాలిక ప్రభుత్వ అధినేత యూనస్, ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో మొదట్లో వీరిద్దరు మిత్రులుగానే ఉన్నారు. కానీ ఎన్నికల నిర్వహణ, సైనిక జోక్యం, యూనస్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల కారణంగా ఇద్దరి మధ్య బాగా దూరం పెరిగినట్లు తెలుస్తోంది. గతేడాది ఆగస్టులో విద్యార్థు నిరసనల కారణంగా ప్రధాని పదవికి రాజీనామా చేసి షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోయారు. అనంతరం జరిగిన చర్చల్లో రిజర్వేషన్లలో సంస్కరణలు చేపడతామని.. అలాగే త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామన్న హామీ ఇవ్వడం ద్వారా మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. దీంతో యూనస్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ మద్దతు సైతం తెలిపారు. కానీ బాధ్యతలు చేపట్టిన తర్వాత యూనస్.. గతంలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టడంతో వీరి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇస్లామిస్ట్ నాయకులతోపాటు, బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటు దారులను జైలు నుంచి విడుదల చేయడంలో యూనస్ కీలకంగా వ్యవహరించారు. ఈ అంశం ఆర్మీ చీఫ్‌ను తీవ్ర కలవరపాటుకు గురి చేసిందని తెలుస్తోంది. దీంతో యూనస్‌తో ఆయన అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. గతేడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లు సంస్కరించాలంటూ దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనకు పిలుపు నిచ్చారు. ఈ ఆందోళనకు ప్రజలు సైతం మద్దతు తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో అధికార పార్టీ వర్గాలకు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో దాదాపు వంద మంది పౌరులతోపాటు పలువురు పోలీసులు సైతం మరణించారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఆ కొద్ది రోజులకే మళ్లీ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా డిమాండ్ చేస్తూ.. ఆందోళనలు మొదలయ్యాయి. ఇవి ఉద్రిక్తంగా మారడంతో.. ప్రధాన మంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. అనంతరం సైనిక రక్షణతో ఆమె భారత్‌కు చేరుకున్నారు. నాటి నుంచి ఆమె భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.

# మరోమారు నోరు పారేసుకున్న పాక్ సైన్యం

- ఉగ్రవాదుల తరహాలో భారత్‌కు హెచ్చరికలు
- సింధూ నీటిని ఆపేస్తే..మీ ఊపిరి నిలిపేస్తామంటూ ప్రేలాపనలు
- పాక్ ఆర్మీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తాజా వ్యాఖ్యలు



ఇస్లామాబాద్, మే 23 (ఆకాంక్ష): భారత్‌ను ఉగ్రవాదులు ఎలా రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారో.. అదే తరహాలో పాక్ మిలటరీ అధికారులు సైతం వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉగ్రవాదుల భాషనే అక్కడి సైనికాధికారులు ఉపయోగిస్తున్నారు. తాజాగా పాకిస్థాన్ మిలటరీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి అదే రీతిలో వ్యవహరించారు. భారత్‌పై ఆగ్రహాన్ని ఆయన తన మాటల్లో వ్యక్తపరిచారు. గురువారం పాకిస్థాన్‌లోని ఒక యూనివర్సిటీలో అహ్మద్ షరీఫ్ చౌదరి ప్రసంగిస్తూ.. మీరు మా నీటిని నిలిపి వేస్తే.. మేము మీ ఊపిరిని ఆపేస్తామంటూ భారత్‌కు వ్యతిరేకంగా కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలు దాదాపుగా లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ చేసిన వ్యాఖ్యలను పోలి ఉన్నాయి. పాక్ మిలటరీ ప్రతినిధి చేసిన ఈ వ్యాఖ్యలు భారత్‌ను బెదిరించినట్లుగా ఉందనే ఓ చర్చ సైతం సాగుతోంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయాల్లో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ఒకటి. ఈ నిర్ణయం తీసుకున్న అనంతరం ఇదే రీతిలో దాదాపుగా ఇదే తరహాలో లష్కరే తోయిబా చీఫ్ స్పందించిన విషయం విదితమే. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సరిగ్గా నెల రోజులకే పాకిస్థాన్ మిలటరీ ప్రతినిధి అహ్మద్ షరీఫ్ చౌదరి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదితో చేసుకున్న సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయాలని న్యూఢిల్లీ నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దీనిపై పాక్ నేతలు స్పందిస్తూ పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మాట్లాడుతూ భారత్‌పై ప్రేలాపనలు పేలారు. పాక్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అహ్మద్ షరీఫ్ ప్రసంగిస్తూ..'భారత్ మాకు వచ్చే నీటిని అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూ నదిలో జలాలకు బదులుగా వారి రక్తం పారుతుంది' అని అన్నారు. ఆయన వ్యాఖ్యలను అఫ్గాన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మరియం సోలైమాంఖిల్ తీవ్రంగా ఖండించారు. దేశానికి చెందిన ఓ సైనికాధికారి ఇలా మాట్లాడటం సరైన చర్య కాదని అన్నారు. లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ సింధూ నది గురించి మాట్లాడుతూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అన్నారు. 'కశ్మీర్‌లో డ్యాం నిర్మించడం ద్వారా పాక్‌కు నీళ్లు ఆపేస్తామని మీరంటున్నారు. పాక్‌ను నాశనం చేయాలని, చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా ప్రణాళికలను విఫలం చేయాలని కోరుకుంటున్నారు. కానీ మీరు నీళ్లు ఆపేస్తే.. నదుల్లో మళ్లీ రక్తం పారుతుంది' అని అతడు అన్నాడని గుర్తు చేశారు. పాక్ అధికారులు అక్కడి ఉగ్రవాదుల స్క్రిప్ట్‌ను చదువుతున్నట్లు ఉందని పేర్కొన్నారు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూఢిల్లీ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దీంతో పాక్ నేతలు భారత్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టె , పాక్ రక్షణ మంత్రి సైతం ఇటీవల ఈ విషయంలో భారత్‌పై నోరు పారేసుకున్నారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. గతంలో లష్కరే తయ్యిబా ఉగ్రవాది సైతం ఇవే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్.. ఈ ఘటన వెనుక ఉందనేందుకు కీలక సాక్ష్యాధారాలను భారత్ సంపాదించింది. దీంతో ఆ మరునాడే సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అంతేకాదు.. నీరు, రక్తం ఒకేసారి ప్రవహించవంటూ భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయంపై లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ తన అక్కసును వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో అతను సైతం ఇవే వ్యాఖ్యలు చేశారు. కాగా, 2008లో ముంబై ఉగ్రదాడికి కీలక సూత్రధారిగా హాఫీజ్ వ్యవహరించడమే కాకుండా.. భారత్, అమెరికాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంలో సిద్ధహస్తుడన్న సంగతి అందరికీ తెలిసిందే.

## చిన్న గల్లీలు...పెద్ద ప్రమాదాలు !

**ఆకాంక్ష :** వేసవి అనగానే ఎక్కడో ఒకచోట పెద్ద అగ్నిప్రమాదం అన్నది చూస్తూనే ఉన్నాం. గత నాలుగైదేళ్ల అనుభవాలు చూస్తే, అగ్నిప్రమాదాలు జరగడం సర్వసాధారణంగా మారింది. అప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకోవడం మినహా పెద్దగా ముందస్తు చర్యలు శూన్యం. ఇకపోతే ప్రమాదాలు మానవ తప్పిదాలే అన్నది తెలుసుకోవాలి. ఇందులో ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టలేం. కాకపోతే ప్రమాదాలకు కారణాలను వెతికి నివారణ చర్యలు సూచించాల్సింది ప్రభుత్వమే. నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే ప్రమాదాలకు కారణమని గుర్తించాలి. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి. అయితే ఎక్కువ ప్రమాదాలు చెత్తా చెదారం, పాతభవనాలు, గ్యాస్ పేలుళ్లు, ప్లాస్టిక్ సామాన్య గోడౌన్లలోనే జరుగుతున్నాయి. దీనికి కేవలం ప్రజల నిర్లక్ష్యంగానే చూడాలి. హైదరాబాద్ గుల్జార్ హౌజ్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది.ఇది కేవలం వారి తప్పిదమే కారణమని తెలుసుకోవాలి. ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది వెళ్లడానికి కూడా వీలులేని ఇరుకు మెట్లను చూడవచ్చు. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థీకృత లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే ప్రమాదాలు సంభవిస్తున్నాయనడానికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరిగినా, ఇందులో పొరపాట్లు కూడా ఇమిడి ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు వెళ్లడానికి వీలు లేనంత ఇరుకుగా మెట్ల మార్గాలు ఉంటున్నాయి. వీటిపై మళ్లీ పై అంతస్థులు అనధికారికంగా నిర్మిస్తున్నారు. ఇలాంటివి నిరోధించే వీలుంది. ఇలాంటి భవనాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవచ్చు. నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే నివసిస్తున్న వారి నిర్లక్ష్యం కనిపిస్తుంది. భవనాల్లో ఎప్పుడో వేసిన విద్యుత్ తీగలు వేలాడుతుంటాయి. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, వాటిపై అధిక లోడు పడేలా ఎసిలు, ఫ్రిజ్‌లు, ఇతర గృహోపకరణాలు ఉపయోగించడం చూడవచ్చు. తాత్కాలిక మరమ్మతులతో షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది.ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడంతో పాటు మనుషుల నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి. ప్రధానంగా లోడును పట్టించుకోకుండా ఉపయోగించే విద్యుత్ కారణంగా వైర్లు తగలబడి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పాతబస్తీ లాంటి చోట వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాలకు కారణంగా చూడాలి. హైదరాబాద్ పాతబస్తీ తిరిగి చూస్తే...ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో అస్తవ్యస్థంగా ఉంటాయి. ఇక్కడ గల్లీలు కూడా ఇరుకుగా ఉండి రాకపోకలకు ప్రతిబంధకంగా ఉన్నాయి. దీనికితోడు దొంగకరెంట్ వాడకం కూడా ఎక్కువే. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.ఇవన్నీ సవరించాల్సి ఉంది. ఇలాంటి వీధుల్లో ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి అనువుగా ఉండడం లేదు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సకాలంలో వాహనాలు చేరుకున్నా..గల్లీల్లో వెళ్లలేక పోవడంతో అవి పెద్ద ప్రమాదాలుగా మారుతున్నాయి. మంటలను నియంత్రించ లేక పోతున్నారు. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు కూడా పాతబస్తీలో ఎక్కువే. ప్రమాదాలు జరిగితే ప్రాణాలను కాపాడే అవకాశాలను తక్కువేనని గుల్జార్ హౌజ్ ప్రమాదం గుర్తు చేసింది. ఎందుకంటే అక్కడ ఇరుకైన భవనంలో ఈ ప్రమాదం జరిగింది. కేవలం పొగతో ఊపిరాడ్ సగం జనం చచ్చారు. ప్రజలు తమకున్న చిన్న ఇంటిపై మరో అంతస్తు నిర్మించుకుంటున్నారు. మనిషి దూరేంత సందులో మెట్లు కడుతున్నారు. ఇలా చేయడం వల్ల ప్రమాదాలను నిరోధించలేకపోతున్నారు. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్నిప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం కూడా ప్రమాదాల తీవ్రతను పెంచుతున్నాయి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్ణీత కాల వ్యవధిలో అగ్నిప్రమాదాలకు సంబంధించి ఆడిట్‌లు నిర్వహించాలి. భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా చేయగలగాలి.విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. ప్రమాదం జరిగినప్పుడు సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా పాతబస్తీలో జరిగిన ఈ ఘటనతో నగరంలో అనేక చోట్ల ఇలాంటి ఇరుకైన భవనాల కోసం అసవరమైతే డెమో నిర్వహించాలి. నిరంతరాయంగా ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు తనిఖీలు నిర్వహించడం కూడా అవసరమే. ఇది ఒక్క పాతబస్తీకే పరిమితం కారాదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్నిప్రమాదాలపై ప్రజల్లో అవగాహనను పెంచాలి.

## ఉగ్రవాదుల ఉత్పత్తి కేంద్రం పాకిస్థాన్

### అక్కడి ప్రభుత్వం,ఆర్మీ పెంచి పోషిస్తున్నాయి
### నెదర్లాండ్స్ పర్యటనలో విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ,మే 23(ఆకాంక్ష ):** దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఘటన జరిగిన ప్రతిసారీ తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నదని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మండిపడ్డారు. తమ నేలపై ఉగ్రవాదం లేదంటూ పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనలను ఆయన ఖండించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో పాకిస్థాన్ ప్రభుత్వంతోపాటు ఆ దేశ సైన్యం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యూరప్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా నెదర్లాండ్స్‌లో మంత్రి జై శంకర్ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన జాబితాలోని ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారన్నారు. వారంతా పెద్దపెద్ద నగరాల్లో నివసిస్తున్నారని చెప్పుకొచ్చారు. అక్కడి నుంచే వారు ఈ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వారి చిరునామాలే కాదు.. ఎవరెవరితో వారు సంబంధాలు నెరుపుతున్నారో కూడా పాక్ ప్రభుత్వానికి తెలుసని వెల్లడించారు. అంతేకాదు వారంతా పట్టపగలు పాకిస్థాన్‌లో బహిరంగంగా తిరుగుతున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరిని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ విషయంలో భారత్ ఒక ఖచ్చితమైన ముగింపును మాత్రం కోరుకుంటుందన్నారు. తమకు పాకిస్థాన్‌పై ఆగ్రహం లేదని.. కానీ ఉగ్రవాదంపై ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో లెక్కలేనన్ని ఉగ్రవాద స్థావరాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. అలాంటి పాకిస్థాన్.. తమ దేశానికి ఉగ్రవాదంతో ఎటువంటి సంబంధం లేదంటూ చెప్పడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదం ఇదే రీతిగా కొనసాగితే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎదురయ్యే పరిణామాలను ఆ దేశం తప్పక ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి జై శంకర్ హెచ్చరించారు. అలాగే భారత్‌కు ఉగ్రవాదం, జమ్మూకాశ్మీర్ అంశాలు వేర్వేరని స్పష్టం చేశారు. ఉగ్రవాదం అనేది స్వతంత్రమైనది. అదే విధంగా పూర్తిగా ఆమోదయోగ్యం కాని అంతర్జాతీయ నేరమన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించకూడదని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక రంగాన్ని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు భారత్, పాకిస్థాన్‌ల మధ్య మధ్యవర్తిత్వానికి నెరపడానికి అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకు వచ్చినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని భారత్ తోసిపుచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాశ్మీర్ అంశంలో మూడో ప్రమేయాన్ని తాము అంగీకరించబోమని కూడా మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో ఉగ్రవాదం, పివోకెలపైనే తమ చర్చలు ఉంటాయని అన్నారు.

# భవిష్యత్తులో కోకోకి కూడా
# ఒక చట్టం తెచ్చే యోచనలో ఉన్నాము

- రాష్ట్ర మంత్రులు కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్ధసారధి..
- కిలో కు రూ.500 ధరకు కోకో గింజలు కొనుగోలు..



**ఏలూరు, ఆకాంక్ష :** రైతులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా దానిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం స్దానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్ధసారధితో కలిసి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రికె. అచ్చెన్నాయుడు తో కలిసి పాత్రికేయుల సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాటలైతే గత ప్రభుత్వంలో విపరీతంగా చెప్పారు. రూ.3 వేల కోట్ల రూపాయలు ధరల స్థిరీకరణ నిధి పెట్టామన్నారు. ఎంత ఖర్చు చేశారో చూస్తే సున్నా, ఒక్క పైసా కూడా గత ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. అందుకు సంబంధించి ఐదేళ్ళ రికార్డు మా దగ్గర ఉందని మంత్రి చెప్పారు. గత ఐదేళ్ళ రైతుకు ఎన్ని ఇబ్బందులు వచ్చిన గత ప్రభుత్వం పట్టించుకోలేదు కదా, కనీసం రైతులు, రైతు సంఘాలను ప్రభుత్వం కలవలేదన్నారు. రైతుల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రూ.140 కోట్ల స్థిరీకరణ నిధి పెట్టి ఇప్పటికే రూ. 80 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్రంలో నాలుగైదు పంటలకు ధరల్లో ఇబ్బంది వచ్చిందని, ఆయినా ప్రభుత్వం మాకు సంబంధ లేదని ఊరుకోలేదన్నారు. ఆరు మాసాల నుంచి ముఖ్యమంత్రి ప్రభుత్వం దానిపైనే దృష్టిపెట్టారన్నారు. మిర్చి పంటకి ఇబ్బందులు వస్తే మిర్చి పండించిన రైతుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్రంతో మాట్లాడి పరిష్కరించామన్నారు. మళ్లీ ఈ మద్య కాలంలో ఏలూరు జిల్లాలో కోకో రైతులకు ఇబ్బంది వచ్చిందని, అదే విధంగా ప్రకాశం జిల్లాలో (నల్లబర్లీ) పొగాకు రైతులకు ఇబ్బంది వచ్చిందని, అదే విధంగా మామిడి పండించిన రైతులకు ఇబ్బందులు వచ్చాయని, వీటిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మీరు ఎప్పటికప్పుడు ఈ రాష్ట్రంలో ఏ పంటలు పండుతున్నాయి, ధరలు ఏ విధంగా ఉన్నాయి మీరు దగ్గరగా చూచి రైతుకు ఎక్కడా ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూడమని ఆదేశించామన్నారు. గత రెండు మాసాల నుంచి జిల్లాలో కోకో మీదచాలా ఇబ్బందులు వచ్చాయన్నారు. మేము ఎప్పుడూ తప్పించుకోలేదన్నారు. రెండు మూడు సార్లు మీటింగు పెట్టామన్నారు. మా ప్రిన్సిపల్ సెక్రటరీగారు, కమీషనర్ పెట్టారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని, రైతులు ఆందోళన చెందుతున్నారని ఈ దృష్ట్యా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రైతుల దగ్గరకే వచ్చి సమావేశం నిర్వహించి సుమారు 3 గంటలు వారితో చర్చించామన్నారు. ఈ సంవత్సరానికి కోకో కొనుగోలుపై ఒక నిర్ణయం తీసుకున్నామని ఈ విషయంలో దాపరికం లేకుండా ఒక మధ్యస్థ ధర ఉండేలా కంపెనీలతో మాట్లాడటం జరిగిందన్నారు. కంపెనీల వారు రూ. 450/-కి కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ మరో రూ.50/-లు ప్రభుత్వం భరించి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కోకో ను కిలో రూ.500/-లు కొనుగోలు చేయాలని ప్రస్తుతం రైతుల దగ్గర ఉన్న కోకో గింజలను అన్నింటిని కొనుగోలు చేయాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు. చాలా స్పష్టంగా, గట్టిగా చెప్పాం రైతులకు ఎక్కువ ధర వచ్చేలా కంపెనీలతో మాట్లాడాలని సీఎం చెప్పారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో చాక్లెట్ల తయారీ ఉత్పత్తులు తగ్గాయని దీని మూలంగా కూడా కొంత సమస్య ఏర్పడిందన్నారు. అయితే కంపెనీలను రేపటి నుంచి కోకో కూడా ఎన్ని టన్నులు ఉంటే అంతా కంపెనీలు కొంటాయని, కంపెనీలు ఇచ్చే ధరలకు అదనంగా ప్రభుత్వం కొంత భరిస్తుందన్నారు. భవిష్యత్తులో కోకోకి కూడా ఒక చట్టం తెచ్చే యోచనలో ఉన్నామని, అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న ధర వచ్చేలా చట్టం రూపొందిస్తున్నామన్నారు. కోకో పంట నాణ్యత విషయంలో రైతులకు శిక్షణ ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. కోకో అంతర పంట, రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. మరోపక్క నల్ల బర్లీ పొగాకులో చాలా ఇబ్బందులు ఉన్నాయని, ఎగుమతులు ఆగిపోయాయన్నారు. ప్రకాశం జిల్లాలో కూడా రైతులు, కంపెనీలు, పొగాకు బోర్డును కూర్చో బెట్టి సమస్య పరిష్కరిస్తామన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మొత్తం నల్లబర్లి పొగాకు కొనాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. వచ్చే ఏడాది నుంచి డిమాండ్ ఆధారంగా పంట వేసే విషయాన్ని ఆలోచించాలని చెప్పారు. రైతులు ఏ పంటకు ధర వస్తే అదే పంటను ఎక్కువగా వేస్తున్నారని, ఈ సందర్భంలో ధర పతనమైతే నష్టపోతున్నారన్నారు. ధరలు రాలేదని, కౌలు పెరిగిందని రైతులు ఎవరు అధైర్యపడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని మంత్రి హితవు పలికారు. ఈ ప్రభుత్వం మీదని, రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు తావులేకుండా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని, వారికి అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్, ఉధ్యానవన శాఖ కమీషనరు కె. శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), సొంగా రోషన్ కుమార్, తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన సన్న బియ్యంతో నే అవినీతికి అడ్డుకట్ట:జనచైతన్య వేదిక




**గుంటూరు, ఆకాంక్ష :** ఆంధ్రప్రదేశ్ లో రేషన్ బియ్యం లో అవినీతిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ మాదిరిగా నాణ్యమైన సన్నబియ్యాన్ని రేషన్ కార్డు గల లబ్ధిదారులకు అందించాలని, బియ్యంతో పాటు రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు లాంటి వాటిని అందించాలని ,కేరళ మాదిరిగా ప్రజలకు మూడు రకాల కార్డులు అందుబాటు లో ఉంచాలని ఒక కార్డు రేషన్ బియ్యం కోసం, మరొక కార్డు సంక్షేమ పథకాల కోసం, మూడవ కార్డు ఇతర అవసరాల కోసం వినియోగించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 3 కార్డుల విధానాన్ని అమలు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థలో కేవలం బియ్యం మాత్రమే కాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా వివిధ రకాల నిత్యవసర వస్తువులను కూడా అందుబాటులో ఉంచాలని జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో రేషన్ బియ్యం లో అవినీతి – పరిష్కారాలపై జరిగిన చర్చా గోష్టిలో వక్తలు తెలిపారు. చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సిపిఐ సీనియర్ నేత మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్ ప్రసంగిస్తూ కేరళ లో 16 రకాల సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారని, తమిళనాడులో 7,8 రకాల వస్తువులు అందిస్తున్నారని తెలిపారు. జీవన శైలిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా చిరుధాన్యాలను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో, ప్రజా సంఘాలతో, మేధావులతో చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో 1.6 కోట్ల కుటుంబాలు ఉండగా వారిలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఆహార భద్రత కోసం ఏర్పాటు చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కాసులు కురిపించే వ్యవస్థగా మారిందన్నారు. దాదాపు 80శాతం మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న దొడ్డు బియ్యాన్ని తినడం లేదని, కేజీ 10 రూాల నుండి 15 రూాలకు దళారీలకు అమ్ముతున్నారన్నారు. అత్యధిక అధికార పార్టీ ఎమ్మెల్యేలు మండలానికి ఒక ఏజెంటును నియమించుకుని వారి ద్వారా ప్రతినెలా 20 లక్షల రూపాయలు తీసుకుంటున్నారని 5 సంవత్సరాలలో 12 కోట్ల రూపాయల అవినీతికి లోనవుతున్నారన్నారు. ఇలాంటి అవినీతిని నిర్మూలించడానికి లబ్ధిదారులకు నాణ్యమైన సన్న బియ్యంతో పాటు చిరుధాన్యాలను అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు నెలలుగా నాణ్యమైన సన్న బియ్యాన్ని రేషన్ కార్డు లబ్ధిదారులకు, హాస్టళ్లకు, అంగన్వాడి కేంద్రాలకు మధ్యాహ్న భోజన పథకానికి అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రసంగిస్తూ రేషన్ బియ్యం లో అవినీతి, నగదు బదిలీ పథకం ద్వారా పరిష్కారం కాదని నాణ్యమైన నిత్యవసరాలు అందించడమే సరైన మార్గం అన్నారు. రేషన్ షాపులతోపాటు బియ్యం పంపిణీ వాహనాలు కూడా కొనసాగించడం ద్వారా వృద్ధులకు, వికలాంగులకు తోడ్పడుతు ఒదన్నారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్ ప్రసంగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 29వేల రేషన్ షాప్స్ ఉన్నాయని, వాటిని మరింత పటిష్ట పరిచి మినీ సూపర్ బజార్లగా మార్చాలన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటా ఆంజనేయులు ప్రసంగిస్తూ నాణ్యతలేని తినడానికి వీలుకాని బియ్యాన్ని రాష్ట్రప్రభుత్వం అందించడం ద్వారానే అవినీతికి, దళారి వ్యవస్థకు దారి తీస్తుందన్నారు. కరోనా సమయంలో రేషన్ షాప్ డీలర్లు పేదలకు అండగా నిలిచారన్నారు. వేలాది మంది అనర్హులకు కూడా తెల్ల కార్డులు ఉండటం సమస్యగా మారిందన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ ఎన్నికలలో ఓట్ల లబ్ధి కోసం విరివిరిగా రేషన్ కార్డులను పంపిణీ చేశారని, చౌక బియ్యం అవసరం లేని వారికి కూడా తెల్ల కార్డు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో 95శాతం కుటుంబాల వద్ద తెల్ల కార్డులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హుల వద్ద ఉన్న తెల్ల కార్డులను తొలగించాలని కోరారు. ఈ చర్చా గోష్టిలో అధ్యాపకులు కె. జగదీష్, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చావా శివాజీ, నల్లబోతు సాంబశివరావు, ఆలా అనంత రామయ్య, జనవిజ్ఞాన వేదిక నేత గోరంట్ల వెంకటరావు తదితరులు ప్రసంగించారు.

## ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం:కారును ఢీకొన్న లారీ: ఆరుగురు దుర్మరణం

**ఒంగోలు,మే 23(ఆకాంక్ష ):** ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు- వద్ద శుక్రవారం మధ్యాహ్నం కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా స్టువర్ట్‌పురం వాసులను పోలీసులు తెలిపారు. కారులోని వారంతా మహానంది వద్దనున్న మహాబలిపురం వెళ్లి.. బాపట్ల తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు- చేసుకుందని వెల్లడించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు- పోలీసులు వివరించారు. ప్రమాద సమయానికి ముందు కారు, లారీలు రెండు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని.. అందుకే ప్రమాద తీవ్రత బాగా పెరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా మరణించారని చెప్పారు. కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు.

# కృష్ణా జిల్లాను అభివృద్ధికి కేంద్రంగా మారుద్దాం:మంత్రి కొల్లు రవీంద్ర

- తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేలా టీడీపీ నిర్మాణం
- తెలుగు వారి సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన చంద్రబాబు
- గ్రామ స్థాయి కమిటీల నిర్మాణమే తెలుగుదేశం పార్టీ బలం
- విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా కృష్ణా జిల్లాను మారుద్దాం



మచిలీపట్నం, ఆకాంక్ష : తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అయితే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అతిపెద్ద పండుగ మహానాడు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు, మచిలీపట్నం శాసనసభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన కృష్ణా జిల్లా మినీ మహానాడు వేడుకలో పార్లమెంటు అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న సంస్థాగత నిర్మాణం ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి లేదు. ఆరోజు అన్న నందమూరి తారక రామారావు నిర్ణయం మేరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకున్నాం. నాటి నిర్ణయం ఫలితంగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా కార్యకర్తలు అండగా నిలిచారు. ఎంత మంది నాయకులు పార్టీని వీడినా కార్యకర్తలు పార్టీని వీడలేదు. తెలుగుదేశం అనేది నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీ. నాడు అన్న ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవం నినాదంతో ముందుకు వెళ్తే.. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తెలుగువారిని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలని శ్రమిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీపై కక్ష గట్టి వేధింపులకు పాల్పడ్డాడు. కానీ కార్యకర్తల నిబద్ధత కారణంగా మళ్లీ అధికారంలోకి వచ్చాం. దకుటుంబ సాదికార సారధుల నియామకం ద్వారా గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. తద్వారా రాబోయే కాలమంతా తెలుగుదేశం పార్టీదే. 2024 ఎన్నికల్లో అప్రజాస్వామిక పాలనను ప్రజలు, కార్యకర్తలు తరిమికొట్టాం. 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకునేలా చేసుకోవాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. పెన్షన్లు, అన్న క్యాంటీన్లు అమలు చేస్తున్నాం. త్వరలోనే తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీ భవ పథకాలను ప్రారంభించబోతున్నాం. ఈ కార్యక్రమాల గురించి ప్రతి ఇంటికీ వివరించాలి. సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల్ని ఏర్పాటు చేసుకుంటున్నాం. మద్యం కుంభకోణంలో అంతా బయటపడేసరికి.. దిక్కుతోచక మనపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. జగన్ రెడ్డి అరాచకాలను, తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టి ముందుకు వెళ్లాలి. పెడన రోడ్డులో 2 ఎకరాల్లో జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. వచ్చే ఏడాది మహానాడును ఆ కొత్త పార్టీ కార్యాలయంలో నిర్మించుకుంటాం. ఏడు నియోజకవర్గాల నుండి కార్యకర్తలు, నాయకులు ముందుకు వస్తే నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకుందాం. కృష్ణా జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు అడుగులు వేయాలి. మరోవైపు కృష్ణా జిల్లాను సీఆర్డీఏలో విలీనం చేయడం ద్వారా మరింత అభివృద్ధి సాకారం అవుతుంది. అందుకోసం అవసరమైతే ఎమ్మెల్యేలంతా ముఖ్యమంత్రిని కోరుదాం. మల్లవల్లిని అభివృద్ధి చేసుకుంటూ పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టాం. విజయవాడ మచిలీపట్నం రోడ్డు 6 లైన్లతో అభివృద్ధి చేయబోతున్నాం. అదే సమయంలో బందరు పోర్టు నుండి అమరావతికి ఇన్లాండ్ వాటర్ వేస్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా మరింత అభివృద్ధికి ఆస్కారం లభిస్తుంది. ఇన్లాండ్ వాటర్ వే నిర్మాణానికి అవసరమైన నిధుల్ని కేంద్రం నుండి తెప్పించుకునేలా చర్యలు తీసుకుంటాం. బందరుకు ప్రధాన తాగునీటి వనరైన బందరు కాలువలో మురుగు చేరుతున్న నేపథ్యంలో.. కృష్ణా నది నుండి బందరు వరకు పైపులైన్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా మంత్రి కొల్లు రవీంద్ర ప్రతిపాదించారు. కృష్ణా జిల్లా చరిత్రను నాశనం చేసేలా కొంత మంది వ్యవహరించారు. బందరులో ఉన్న ఓ పందికొక్కు పేదల బియ్యం తినేసి.. సిగ్గులేకుండా బొంకుతున్నాడు. అలాంటి వారికి నడిరోడ్డుపై బుద్ధి చెప్పాలి. గుడివాడకు చెందిన గూండా గుండె నొప్పి అంటూ బెయిల్ తెచ్చుకున్నాడు. రంగులేసుకుని తిరిగే మరో వ్యక్తి అసలు రంగు బయటకొచ్చింది. కొత్త కమిటీలు, పాత నాయకత్వం కలిసి ముందుకు వెళ్దాం. కష్టబడి పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు లభిస్తాయి. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీలు, మున్సిపాలిటీలను నూటికి నూరు శాతం గెలిపించి తెలుగుదేశానికి కృష్ణా జిల్లా కంచుకోట అని మరోసారి నిరూపిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ



గన్నవరం, ఆకాంక్ష : గత ఏడాది ఆగస్టులో సంభవించిన బుడమేరు వరద ముంపుకు గురైన ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో కంప్యూటర్లను వితరణగా అందించారు. బుడమేరు వరదల్లో ఎన్టీఆర్ జిల్లాలోని సుమారు 67 పాఠశాలలు వరద ముంపుకు గురి కావటంతో ఆర్థికంగా నష్టపోయారు. దీంతో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు తమ ఇబ్బందులను అప్పట్లో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న యార్లగడ్డ దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే సమయంలో వరద ముంపు వల్ల ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న సుమారు 12,000 మంది విద్యార్థులు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు వరద నీటిలో మునిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని యార్లగడ్డకు వివరించారు. తక్షణమే స్పందించిన యార్లగడ్డ వీరి ఇబ్బందులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన లోకేష్ తొలిసారి ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పార్టీ పుస్తకాలు అందించేందుకు నిర్ణయించారు. వరద ముంపు కు గురైన పాఠశాలలకు సాయం చేస్తానన్న యార్లగడ్డ వెంకట్రావు తనతో పాటు తన స్నేహితులతో మాట్లాడి సి ఎస్ ఆర్ నిధులనుంచి సుమారు 14 లక్షల విలువచేసే కంప్యూటర్లు కంప్యూటర్ పరికరాలను అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న 27 ప్రవేటు పాఠశాలలకు కంప్యూటర్లు,ప్రింటర్లు, స్కానర్లను యార్లగడ్డ అందజేశారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడంలో సహకరించిన యార్లగడ్డకు, మంత్రి లోకేష్ బాబుకు ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు ఫణి ప్రసాద్, దేవినేని కిషోర్ కుమార్, గోన సాంబశివరావు, షేక్ ఇమామ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డి.చెక్కవారిపల్లి లో ఘనంగా సీతా రామాంజనేయ స్వామి 6,వ వార్షికోత్సవము



తనకల్లు, ఆకాంక్ష : తనకల్లు మండలపరిధిలో ని డి చక్కవారిపల్లి లో సీత రామాంజినేయ స్వామి 6 వ వార్షికోత్సవ ము ను ఘనంగా నిరహించారు. చుట్టుపక్కలగ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తి శ్రద్ధలతో గ్రామ ప్రజలు స్వామి వారి పాత్రకు కృప అయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఆలయ చైర్మన్ వెలగ క్రిష్టప్ప భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్న ప్రసాదలు తీర్థములతో వచ్చిన భక్తులకు అందచేశారు. ఈ కార్యక్రమములో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలి



శేరిలింగంపల్లి, ఆకాంక్ష : శుక్రవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన కార్పొరేటర్ల సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే, కార్పొరేటర్లు మంజుల రెడ్డి , చందానగర్, వి సింధు ఆదర్శ రెడ్డి, భారతి నగర్ డివిజన్, మేట్టు కుమార్ యాదవ్ పటాన్చెరువు డివిజన్, వి గంగాధర్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్, బి రాజ్ కుమార్, యూసఫ్ కూడా డివిజన్, దేదీప్య వెంగళరావు నగర్ జగదీశ్వర్ గౌడ్ , మాదాపూర్ డివిజన్, పుష్ప నగేష్ యాదవ్ రామచంద్రపురం డివిజన్ %+ఎవీజ%, అలాగే అన్ని సర్కిల్ల ఉప కమిషనర్లు మరియు సూపర్ టెండింగ్ ఇంజనీర్, గేమ్స్ ఇన్స్పెక్టర్ మొదలైన అధికారులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే ఐఏఎస్ మాట్లాడుతూ అన్ని విభాగల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమిష్టి కృషి తో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి కి ప్రతి ఒక్కరు కృషి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై చర్చించడం జరిగింది. పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచారు, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని,నాలల విస్తరణ పనులను వేగవంతం చేయాలని , పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని,వర్షాకాలం లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నాలల విస్తరణ పనులు వేగవంతం చేయాలని తెలియచేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే ఐఏఎస్ తెలియచేసారు.

# ఆటోనగర్‌లో చెత్త సమస్యకు చెక్..

## ఎం.పి. కేశినేని శివనాద్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చొరవతో ఆటోనగర్‌లో పరిశుభ్రతకు పెద్దపీట

- ఆటోనగర్‌లో చెత్త తరలింపునకు జిందాల్ సంస్థతో ఒప్పందం
- ఆటోనగర్‌లో చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనం
- స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ పట్టాభి, ఐలా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



పటమట, ఆకాంక్ష : ఆటోనగర్‌లో ఉత్పత్తి అయ్యే చెత్త సమస్యకు ఎం.పి. కేశినేని శివనాద్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చొరవతో చెక్ పడింది. ఇక నుంచి ఆటోనగర్‌లో పరిశుభ్రత వెల్లివిరియనుంది. ఆటోమొబైల్ రంగానికి పేరుగాంచిన ఆటోనగర్‌లో పేరుకుంటున్న చెత్త వల్ల అపరిశుభ్రవాతావరణం నెలకుంటున్న నేపథ్యంలో ఎం.పి. కేశినేని శివనాద్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆటోనగర్‌లో ఇక నుంచి పరిశుభ్రత నెలకునేలా ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. దేశంలోనే పేరున్న ఆటోనగర్‌లో చెత్త సమస్యను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ దృష్టికి వెళ్ళడంతో ఆటోనగర్‌లో పరిశుభ్రత వాతావరణం నెలకునేలా చేసేందుకు ఐలా అధికారులను వెంట తీసుకుని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కె.పట్టాభితో ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆటోనగర్‌లోని చెత్త సమస్యపై శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆటోనగర్‌లో నెలకుంటున్న అపరిశుభ్రవాతావరణం గురించి పరిశుభ్రతను నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వారితో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో పరిశుభ్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేయాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా ఆటోనగర్‌లో నిత్యం ఉత్పత్తి అయ్యే టన్నుల కొద్ది చెత్తను తరలించి అక్కడ పరిశుభ్రత వాతావరణ నెలకొల్పాలనే లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కె.పట్టాభి, ఐలా జోనల్ మేనేజర్ కంచి బాబ్జితో కలిసి సమావేశం నిర్వహించామన్నారు. విజయవాడ నగర పాలక సంస్థలో ఉత్పత్తి అయ్యే చెత్తను తరలింపునకు జిందాల్ సంస్థతో ఒప్పందం ఉందని, ఆటోనగర్ స్వయం ప్రతిపత్తి ఉండటంతో ఇక్కడ ఉత్పత్తి అయ్యే చెత్తను ఐలా వారే తరలించుకునేవారని చెప్పారు. ఐలాకు ప్రత్యేకంగా డంపింగ్‌యార్డు లేకపోవడం వల్ల ఆటోనగర్‌లోని రహదారుల మార్జిన్స్‌లోనే ఉంచేవారని చెప్పారు. దీనివల్ల పూర్తిగా అపరిశుభ్రవాతావరణం నెలకుంటుందన్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించి స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ పట్టాభితో సమావేశం నిర్వహించామన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే చెత్త మొత్తాన్ని జిందాల్ సంస్థ తరలించేలా ఒప్పందం అయ్యిందన్నారు. రేపట్నుంచి (శనివారం) నుంచే ఈ ఒప్పందం అమలులోకి వస్తోందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఆటోనగర్‌లోని చెత్త మొత్తాన్ని జిందాల్ సంస్థ తొలగిస్తోందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనం ఆటోనగర్‌లో ఉత్పత్తి అయ్యే చెత్తను తరలించడానికి ప్రత్యేక వాహనాన్ని సైతం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చొరవతో ఏర్పాటు కానుంది. చెత్తను తరలించే సమయంలో రోడ్లపై చెత్త పడకుండా ఉండటమే కాకుండా అధికమొత్తంలో ఉన్న చెత్తను చిన్న బాక్సు మాదిరిగా చేసి నాలుగు లారీల చెత్తను ఒక లారీలోనే సరిపోయేంత చిన్నగా చేసి ఈ వాహనం ద్వారా తరలించనున్నారు. ఈ వాహ నం కొనుగోలుకు అయ్యే ఖర్చులో కూడా 50 శాతం సబ్సిడీతో అందించనున్నారు. మరో 10 రోజుల వ్యవధిలో ఈ వాహనం ద్వారా ఆటోనగర్‌లో చెత్తను తొలగించనున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఎన్నో ఏళ్ళ నుంచి ఆటోనగర్‌లో తిష్ట వేసిన చెత్త సమస్యకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రత్యేక చొరవతో చెక్ పడింది.

# గ్రామాల్లో మట్టి తవ్వకాలు అనుమతులు మంజూరు:యార్లగడ్డ



గన్నవరం,ఆకాంక్ష : గ్రామంలోని రైతులు, ప్రజల అవసరాల కోసం చెరువుల్లో మట్టి తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలోని తన కార్యాలయంలో వెంకట్రావ్ విలేకరులతో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులలోని మట్టిని ప్రజల అవసరాల కోసం తరలించుకునేందుకు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చెరువుల్లో మీటర్ లోతు మాత్రమే మట్టితవ్వి ట్రాక్టర్లు, ఎడ్లబడలో మాత్రమే మట్టిని తరలించుకోవాలని చెప్పారు. ఆయా పంచాయతీల కి నామమాత్రం రుసుము చెల్లించి మట్టిని తోలుకోవాలన్నారు. రాత్రివేళ మట్టి తవ్వకాలు అనుమతులు ఇచ్చేది లేదని చెప్పిన ఆయన మట్టి తరలింపు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై అవాకులు చవాకులు పేలుతున్న జగన్మోహన్ రెడ్డి వైఖరిని ఆయన తప్పుపట్టారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా రాజధాని అమరావతిని మార్చాలని శక్తి వంచన లేకుండా కృషి చేశారని ఆయన కుయుక్తులు పారకపోవడంతో మూడు రాజధాని అంశాన్ని తెరపైకి తెచ్చారని గుర్తు చేశారు. జగన్ సీఎంగా ఉండగా రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శరవేగంగా రాజధాని నిర్మాణ పనులు చేస్తుంటే చూసి ఓర్వలేక ఇష్టారీతిన మాట్లాడటం తగదని హితవు పలికారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను లాగేసి చంద్రబాబు ప్రతిపక్ష హోదా తీసేస్తానన్న జగన్ ఇప్పుడు ఏ విధంగా ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని నిలదీశారు. అసెంబ్లీ రూల్స్ తెలిసే అబద్ధాలు ఆడుతున్న జగన్ ఒకవేళ అసెంబ్లీ రూల్స్ గుర్తు లేకపోతే నిబంధనల పుస్తకాన్ని నాలుగుసార్లు చదువుకోవాలని జగన్ కు హితవు పలికారు. చంద్రబాబు తనకు జరిగిన అవమానానికి నిరసనగా అసెంబ్లీని బహిష్కరించారని అసెంబ్లీ కి రాని జగన్ కు ఏ అవమానం జరిగిందని సూటిగా ప్రశ్నించారు. జగన్ అసెంబ్లీకి రాకపోవడం ఎన్నుకున్న ప్రజల్ని, అసెంబ్లీని అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. తాను అధికారంలోకి వస్తే సినిమా చూపిస్తానన్న జగన్ కామెంట్లు పై యార్లగడ్డ స్పందిస్తూ వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 164 నుంచి 11 పడిపోయిందని ముందు పార్టీని ఏ విధంగా బతికించుకోవాలో చూసుకోవాలని హితవు పలికారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెడితే ఆయనకు నివాళులర్పించినట్లు కాదని అంబేద్కర్ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేయడం వల్లే అంబేద్కర్ నివాళులర్పించినట్లు అవుతుందని జగన్ ను ఎద్దేవా చేశారు. డిసిసిలలో జరిగిన అక్రమాలపై తన అసెంబ్లీలో విచారణ కోరగా శాసనసభ కమిటీ వేశారని కమిటీ విచారించి నివేదిక ఇస్తుందని ఈ మేరకు అక్రమాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని యార్లగడ్డ హెచ్చరించారు. శాసనసభ కమిటీ వేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజులకు ఈ సందర్భంగా యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు.